# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:71 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | బుధవారం, అక్టోబర్,14, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-


## కర్ణాటక రాజకీయాల్లో కలకలం..

- బీజేపీలో చేరేందుకు 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారన్న విజయేంద్ర
- వీరిలో సీఎం శివకుమార్ కేబినెట్‌లోని మంత్రులు కూడా ఉన్నారన్న విజయేంద్ర
- డీకే శివకుమార్ వ్యంగ్యాస్త్రాలు

2లో

## కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్



**విజయవాడ, ట్రైనెట్ న్యూస్:** ఇంద్రకీలాద్రిపై కొలు వైన కనకదుర్గమ్మను తమిళనాడు ముఖ్య మంత్రి విజయ్ దర్శించుకున్నారు. చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ విమానాశ్ర యానికి చేరుకున్న సీఎం విజయ్.. నేరుగా దుర్గమ్మను దర్శించుకునేందుకు వెళ్లారు. ఆలయ సంప్రదా యం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగ తం పలికారు. దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఇవాళ రాత్రికి విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొననున్నారు. విజయ్ సీఎం హోదాలో తొలిసారి ఏపీకి రావడంతో.. ఆయన అభిమానులతో విజయ వాడ నగరం కోలాహల ంగా మారింది. పెద్ద ఎత్తున అభిమానులు విమానాశ్రయానికి చేరుకున్నారు.

## ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి
- ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?: కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం
- ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న కిషన్ రెడ్డి
- ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలను అడ్డుకోవడం లేదన్న కేంద్ర మంత్రి



**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను.

మిగతాది 2లో

## వెనుకబడిన వర్గాల నాయకత్వానికి తగిన రక్షణ

- బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారంటూ వైసీపీపై మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు
- రిజర్వేషన్లతో పాటు పార్టీ టికెట్లతో 40 శాతం లక్ష్యం సాధిస్తామన్న కొల్లు రవీంద్ర
- బీసీ నాయకత్వానికి రక్షణగా త్వరలో బీసీ రక్షణ చట్టం
- గత ప్రభుత్వ నిర్ణయంతో 16,800 పదవులు కోల్పోయిన బీసీలు



**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేష న్లకు కోత విధించి వారిని రాజకీయంగా అణచివేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం కల్పిస్తూ వారికి భరోసా ఇస్తోందని రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల నాయకత్వానికి తగిన రక్షణ కల్పించేలా త్వరలోనే 'బీసీ రక్షణ చట్టం' తీసుకురా నున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు.

## సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..



2లో

## దసరా నాటికి పేరు, జెండా, ఎజెండా సిద్ధం

- విజయసాయిరెడ్డి
- కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చిన విజయసాయిరెడ్డి
- దసరా నాటికి పేరు, జెండా, ఎజెండా సిద్ధమవుతాయని ప్రకటన
- రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటే తన లక్ష్యమన్న విజయసాయి



2లో

## శ్రీశైలం ప్రాజెక్టుకు అంతర్జాతీయ ఖ్యాతి

ఇది తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్న గొట్టిపాటి రవి

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు చోటు
- భారీ వరదలను తట్టుకున్న నిర్మాణ పటిష్టతకు దక్కిన గౌరవమని వ్యాఖ్య



**అమరావతి,ట్రైనెట్ న్యూస్:**శ్రీశైలం ప్రాజెక్టుకు

2లో



## విజయ్ రాకతో దద్దరిల్లిన విజయవాడ

విజయ్ సీఎం అయ్యారని, తమిళనాడు అభివృద్ధికోసం కంకణం కట్టుకున్నాం

- వేదికపై మెరిసిన చంద్రబాబు, విజయ్
- వేడుకలకు ముందు ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ
- తెలుగు గంగ, గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చించిన నేతలు
- ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**పున్నమి ఘాట్‌లో ఇద్దరు సీఎంలకు అభిమానులు, ప్రజల నుంచి భారీ స్పందనఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య స్నేహ సంబంధాలకు ప్రతీకగా నిలిచే అరుదైన దృశ్యం విజయవాడలో ఆవిష్కృతమైంది. ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0 (దసరా ఉత్సవాలు) వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఒకే వేదికను పంచుకున్నారు.

2లో

## ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- కవిత డిమాండ్
- ప్రభుత్వం జారీ చేసిన 2026 పోలీస్ నోటిఫికేషన్‌పై కవిత అభ్యంతరం
- ఈ నిర్ణయంతో గిరిజన యువత 400లకు పైగా పోస్టులు కోల్పోతారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్:** తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టుల్లో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు

2లో



## తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తాయని ఆశిస్తున్నాం.

- రాహుల్ గాంధీ

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఐక్యంగా పోరాడతామని విపక్ష 'ఇండియా' కూటమి పౌరసంఘాలు ప్రతిజ్ఞ చేశాయి. ఈ విషయంలో రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుందని.. కచ్చితంగా విజయం సాధిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. దిల్లీలోని తన నివాసంలో 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల సభ్యులతో సమావేశమైన రాహుల్.. వారికి తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఓటు చోరీకి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు. "సుప్రీంకోర్టు, సీజేఐ, న్యాయ వ్యవస్థపై మాకు అత్యంత గౌరవం ఉంది. తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తాయని ఆశిస్తున్నాం. విజయం సాధించేవరకు రాజకీయ, ప్రజాపోరాటం కొనసాగుతుంది. రాజ్యాంగాన్ని దెబ్బతీసి ఎవరూ తప్పించుకోలేరు. ఓట్ల చోరీకి పాల్పడిన వారిని విడిచిపెట్టబోం. ప్రధాని మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ తదితరుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. సోమవారం సుప్రీంకోర్టుకు నిర్వహించిన ర్యాలీలో కనిపించిన దృశ్యం కేవలం పార్టీల ప్రదర్శన కాదు. అది దేశ ప్రజల గొంతుక.

## సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..

- ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!
- సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్
- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు
- పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం



**ఢిల్లీ,త్రినెట్ న్యూస్:** దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది.సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది.బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది.

# ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు

- ముందుగా జనసేనతో డీల్ ఖరారు చేసి, ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం
- తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్
- మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ
- అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో చర్చల్లో పెరిగినవే
- 2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారు



**అమరావతి, త్రినెట్ న్యూస్:**ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అక్టోబర్ 14న ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది.ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.తాజా సమాచారం ప్రకారం, మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన, బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి. పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.ఈ చర్చల నేపథ్యంలో, అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్రధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. “2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు. 2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. “2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జనసైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు” అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## కర్ణాటక రాజకీయాల్లో కలకలం..

- బీజేపీలో చేరేందుకు 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారన్న విజయేంద్ర
- వీరిలో సీఎం శివకుమార్ కేబినెట్‌లోని మంత్రులు కూడా ఉన్నారన్న విజయేంద్ర
- విజయేంద్ర వ్యాఖ్యలకు డీకే శివకుమార్ వ్యంగ్యాస్త్రాలు
- వెంటనే వారిని పార్టీలో చేర్చుకోవాలంటూ సవాల్

**ఢిల్లీ,త్రినెట్ న్యూస్:** కర్ణాటక రాజకీయాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇప్పుడు ఎన్నికలు జరిగితే, ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కేబినెట్‌లోని మంత్రులతో సహా 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం బీజేపీకి అనుకూలంగా మారిందని చెప్పేందుకే ఈ విషయం వెల్లడిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఇతర పార్టీల నేతలను లాక్కోవాల్సిన అవసరం తమకు లేదని అన్నారు.విజయేంద్ర వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తనదైన శైలిలో స్పందించారు. ఆ 25 మందిని ఆలస్యం చేయకుండా వెంటనే బీజేపీలో చేర్చుకోవాలని విజయేంద్రకు వ్యంగ్యంగా సూచించారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ నేతలే కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ చేశారని, అంతకంటే ఏం కావాలని ఆయన ఎదురు ప్రశ్నించారు.ఇదే సమయంలో రాష్ట్రంలో కలకలం రేపుతున్న 'స్టింగ్ ఆపరేషన్' ఆరోపణలపైనా విజయేంద్ర స్పందించారు. కొందరు కాంగ్రెస్ నేతలు ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, వారి బండారం త్వరలోనే బయటపడుతుందని ఆరోపించారు. ఇలాంటి ఘటనల ద్వారా రాజకీయ నాయకులపై ప్రజల్లో నమ్మకం తగ్గుతుందని వ్యాఖ్యానించారు.

# వెనుకబడిన వర్గాల నాయకత్వానికి తగిన రక్షణ

మొదటి పేజీ తరువాయి

ఉన్నారనే అక్కసుతోనే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. కావాలనే తమ అనుయాయులతో కోర్టుల్లో కేసులు వేయించి, సరైన వాదనలు వినిపించకుండా బీసీలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 16,800 మంది బీసీలు చట్టబద్ధంగా దక్కాల్సిన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్ల అంశంపై దృష్టి సారించారని, దీని కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. న్యాయస్థానాల పరిమితులకు లోబడి రిజర్వేషన్లు ఖరారు చేసినప్పటికీ, పార్టీల పరంగా బీసీలకు అత్యధిక సంఖ్యలో టికెట్లు కేటాయించడం ద్వారా మొత్తం ప్రాతినిధ్యం 40 శాతానికి పైగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గత ఐదేళ్ల పాలనలో అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి బీసీ అగ్రనేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి వారి హత్యలకు కారణమై బీసీ నాయకత్వాన్ని అణచివేయాలని వైసీపీ ప్రయత్నించిందని మంత్రి ధ్వజమెత్తారు. ఇటువంటి దాడుల నుంచి బీసీ నేతలను సంరక్షించేందుకు నారా లోకేశ్ ఆధ్వర్యంలో బీసీ రక్షణ చట్టం ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే దానికి చట్టబద్ధత కల్పిస్తామని స్పష్టం చేశారు.

## ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మొదటి పేజీ తరువాయి

కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన యువత 400కు పైగా కానిస్టేబుల్ పోస్టులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

హోంమంత్రిత్వ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, 2026 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేసి ఆదివాసీ, గిరిజన యువతకు పూర్తి న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## విజయ్ రాకతో దద్దరిల్లిన విజయవాడ

మొదటి పేజీ తరువాయి

మంగళవారం సాయంత్రం విజయవాడలోని పున్నమి ఘాట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం విజయ్‌కు, చంద్రబాబు ఘన స్వాగతం పలికారు.ఈ వేడుకలకు ముందు ఇరువురు ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. దశాబ్దాలుగా రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఈ భేటీ సాగింది. ముఖ్యంగా, తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా తమిళనాడుకు కృష్ణా జలాల సరఫరా కొనసాగింపు, ప్రతిష్ఠాత్మకమైన గోదావరి–కృష్ణా–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నట్లు తెలిసింది.అంతకుముందు, విజయవాడ పర్యటనకు వచ్చిన సీఎం విజయ్, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, విజయ్ ఇద్దరూ ఒకే కాన్వాయ్‌లో పున్నమి ఘాట్‌కు చేరుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దారి పొడవునా అభిమానులు, ప్రజలు వారికి నీరాజనాలు పలికారు.కృష్ణా నదీ తీరాన ఏర్పాటు చేసిన వేదికపై ఇరువురు నేతలు ఆశీనులై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్‌ను సత్కరించారు. ఈ పర్యటన కేవలం సాంస్కృతిక వేడుకలకే పరిమితం కాకుండా, రెండు పొరుగు రాష్ట్రాల మధ్య సహకారానికి, జల వివాదాల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దసరా నాటికి పేరు, జెండా, ఎజెండా సిద్ధం

మొదటి పేజీ తరువాయి

**ఢిల్లీ,త్రినెట్ న్యూస్:** తన రాజకీయ భవిష్యత్‌పై మరో ప్రకటన చేశారు. ఆయన త్వరలోనే పార్టీ పెట్టబోతుండడం తెలిసిందే. అందుకు తగిన సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. రాజకీయాల్లో తనది బాల్ థాకరే (శివసేన వ్యవస్థాపకుడు) వంటి పాత్రేనని, అధికారం యువతరానిదే (జెన్–జీ) అని తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. “పార్టీ పేరు, జెండా, ఎజెండా ఈ పవిత్ర దసరా పర్వదినాల్లో సిద్ధం అవుతున్నాయి” అని వెల్లడించారు. తాను పార్టీ పెట్టవద్దని కోరుకునే వారు చేస్తున్న చౌకబారు ప్రచారాలకు విలువివ్వాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటుగానే తన పార్టీ ఆవిర్భవిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. “మరోసారి చెపుతున్నా... అధికారం జెన్–జీది, నాది బాల్ థాకరే పాత్ర” అని తన పోస్టులో వివరించారు.గత సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వైసీపీకి దూరమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత పార్టీకి రాజీనామా చేసి, కొంతకాలం వ్యవసాయంపై దృష్టి సారించారు. ఆయన వేరే పార్టీలో చేరతారంటూ ప్రచారం జరిగినా, వాటన్నింటినీ తోసిపుచ్చుతూ సొంతంగా పార్టీ పెట్టడానికే మొగ్గు చూపారు. తాజా పోస్టుతో విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాల్లో తన తదుపరి అడుగులను ఖరారు చేసినట్టయింది.

## శ్రీశైలం ప్రాజెక్టుకు అంతర్జాతీయ ఖ్యాతి

మొదటి పేజీ తరువాయి

ఈ అరుదైన గుర్తింపుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శ్రీశైలం కేవలం విద్యుదుత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మందికి తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తున్న బహుళార్థసాధక ప్రాజెక్ట్ అని కొనియాడారు.గతంలో భారీ వరదలను తట్టుకుని నిలబడిన శ్రీశైలం డ్యామ్ నిర్మాణ పటిష్ఠతకు ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు రావడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు ఇంజనీరింగ్ నైపుణ్యం, విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం, బహుముఖ ప్రయోజనాలకు ఈ పురస్కారం నిదర్శనమని వివరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టిని మంత్రి ప్రశంసించారు.

# ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

మొదటి పేజీ తరువాయి

శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. “కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి



దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు.తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు.ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం, అక్టోబర్,14, 2026
www.trinetnews.com

# చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో శ్రీ మలయప్పస్వామి దివ్యదర్శనం





**తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :**

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సర్వాలంకార భూషితుడైన స్వామివారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముందుగా గజాలు, అశ్వాలు నడుస్తుండగా, భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, వివిధ కళాబృందాల ప్రదర్శనల నడుమ వాహనసేవ కన్నులపండువగా సాగింది. గోవింద నామస్మరణలతో తిరుమల మాడ వీధులు మార్మోగాయి.

**చిన్నశేష వాహనం -- కుటుంబ శ్రేయస్సుకు ప్రతీక**

వైష్ణవ సంప్రదాయంలో భగవంతుడిని 'శేషి'గా, ప్రపంచాన్ని 'శేషభూతం'గా భావిస్తారు. నాగరాజైన వాసుకిని ప్రతిబింబించే చిన్నశేష వాహనం ఈ శేషి భావాన్ని చాటిచెబుతుంది. చిన్నశేష వాహనంపై స్వామివారిని దర్శించుకోవడం వల్ల కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, కుండలినీ యోగసిద్ధి ఫలాలు లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, పాలకమండలి సభ్యులు, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు హైదరాబాద్ కోర్ ఏరియాలో తాగునీటి సరఫరాకు పటిష్టమైన చర్యలు ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా హైదరాబాద్ కోర్ ఏరియాలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, ప్రభుత్వ చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి (ఎంఎంసి), సైబరాబాద్ (సిఎంసి) మున్సిపల్ కార్పొరేషన్లలో తాగునీటి సరఫరా సన్నద్ధతపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి. కర్ణన్, వినయ్ కృష్ణారెడ్డి, సృజనతో పాటు నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావంతో రిజర్వాయర్లలో నీటి లభ్యత తగ్గినప్పటికీ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరానికి అదనంగా 60 ఎంజీడీల నీటి వినియోగానికి ప్రణాళిక హైదరాబాద్ కోర్ ఏరియాకు ప్రధానంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి నదుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, ఈ నీటి వనరుల పరిధిలో ప్రస్తుతం 560 ఎంజీడీల నీటి లభ్యత ఉందని వివరించారు. నగర తాగునీటి అవసరాలను తీర్చేందుకు కృష్ణా నది నుంచి అదనంగా 15 ఎంజీడీలు, మిషన్ భగీరథ ద్వారా 20 ఎంజీడీలతోపాటు అదనంగా మరో 20 ఎంజీడీలు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి మరో 5 ఎంజీడీల చొప్పున మొత్తం 60 ఎంజీడీల అదనపు నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మల్లన్నసాగర్‌లో 5 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, అక్కడి నుంచి నగరానికి నీటిని తరలించే పైప్‌లైన్ నిర్మాణం నవంబర్‌లో పూర్తికానున్నందున, ఆ వనరు ద్వారా అదనంగా 20 ఎంజీడీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే గత రెండు మూడు నెలలుగా నగరంలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయని, ఫలితంగా నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. శుద్ధి చేసిన నీటిని గృహేతర అవసరాలకు వినియోగించాలి నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్ మెంట్లలో ఏర్పాటు చేసిన మురుగునీటి



శుద్ధి ప్లాంట్లు (ఎస్‌టీపీలు) పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు. శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్ నిర్వహణ, వాహనాల శుభ్రత, ఇతర గృహేతర అవసరాలకు వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వినియోగించేందుకు ప్రత్యేకంగా గ్రీన్ ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు జలమండలి అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు పరిధిలోని జిల్లాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మంజీరా, సింగూరు రిజర్వాయర్ల ద్వారా నీటిని పొందుతున్న మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేయనున్నట్లు సిఎస్ తెలిపారు. ఆయా జిల్లాల్లో ఇప్పటికే బోరుబావులు, ఇతర నీటి వనరులను గుర్తించినట్లు పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన నిధులకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

20 శాతం నీటి పొదుపుతో రోజుకు 80 ఎంజీడీల ఆదా

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో ప్రజలు కేవలం 20 శాతం నీటిని పొదుపుగా వినియోగించినా రోజుకు 80 ఎంజీడీల నీటిని ఆదా చేయవచ్చని ప్రధాన కార్యదర్శి తెలిపారు.

జలమండలి సరఫరా చేసే తాగునీటితో వాహనాలను కడగడం, నీటిని వృథా చేయడం వంటి చర్యలను కట్టడి చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి పొదుపు, వృథా నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 60 రోజుల పాటు విస్తృత స్థాయిలో ప్రచార, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సినిమా నటులు, ప్రముఖులు, సెలబ్రిటీలను భాగస్వాములను చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని తెలిపారు.

ప్రతి నీటి చుక్కను విలువైన వనరుగా భావించి పొదుపుగా వినియోగించడం ద్వారా ఎల్-నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని, ఈ ప్రయత్నంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పిలుపునిచ్చారు.

# ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కేటీఆర్‌పై ఆది శ్రీనివాస్ విమర్శలు డిశ్చార్జ్ పిటిషన్‌పై అభ్యంతరం.. ?54.88 కోట్ల చెల్లింపులపై సమాధానం చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

ఫార్ములా ఈ కార్ రేసు కేసు విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. కేసును గతంలో తేలికగా తీసుకున్న కేటీఆర్ ఇప్పుడు డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేసి విచారణ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తప్పు చేయకపోతే విచారణను ఎదుర్కొని తన నిజాయితీని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. **54.88 కోట్ల చెల్లింపులపై ప్రశ్నలు**ఫార్ములా ఈ రేసు నిర్వహణకు సంబంధించి ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు చేసిన ?54.88 కోట్ల చెల్లింపులపై ఆది శ్రీనివాస్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నిధులను ఎవరి అనుమతితో చెల్లించారో కేటీఆర్ స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ వ్యవహారంలో ఉన్న ఆరోపణలపై న్యాయపరమైన విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని పేర్కొన్నారు.కోర్టులపై నమ్మకం ఉంది: ఆది శ్రీనివాస్కేటీఆర్ గతంలో ఏసీబీ విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు కోర్టును ఆశ్రయించడంపై ఆది శ్రీనివాస్ విమర్శలు గుప్పించారు. విచారణను ఎదుర్కొని ఆరోపణలకు సమాధానం చెప్పాలని సూచించారు. న్యాయస్థానాల ద్వారా ఈ వ్యవహారంలోని వాస్తవాలు బయటపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా, ఫార్ములా ఈ కేసులో తనపై అభియోగాలు కొనసాగించేందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేసింది

# తెలంగాణ మౌలిక వసతుల అభివృద్ధికి కీలక ముందడుగు గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక భేటీ.. పలు ప్రాజెక్టులకు ఆమోదం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

తెలంగాణలో రహదారులు, రవాణా వ్యవస్థ, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో న్యూఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో తెలంగాణలో చేపట్టనున్న పలు కీలక రహదారి, మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే పలు ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కీలకమైన ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం ఆదా కానుంది.

**కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి**

కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా గడ్కరీ ఆమోదం తెలిపారు. జాతీయ రహదారి 167కే (ఎన్‌హెచ్-167ఖ) మీదుగా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అనుసంధానాన్ని మెరుగుపరిచే ఈ వంతెనతో రవాణా సౌకర్యాలు విస్తరించడంతో పాటు పర్యాటక రంగానికి ఊతం లభించనుంది.

**హైదరాబాద్--శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్**



హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారి 765 (ఎన్‌హెచ్-765)పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి స్పందించారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి నూతన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్ ) సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**తెలంగాణకు ఐదు రోప్‌వేలు**

కేంద్ర ప్రభుత్వ పర్వతమాల పథకం కింద తెలంగాణలో ఐదు రోప్‌వేల ఏర్పాటుకు గడ్కరీ ఆమోదం తెలిపినట్లు మంత్రి పేర్కొన్నారు. దీంతో పర్యాటక ప్రాంతాలకు రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు పెరగనున్నాయి.

హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన

హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ రహదారి నిర్మాణం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయనుంది.

మూడు ఆర్‌ఓబీలకు ఆమోదం.. 34 పనులకు

**సీఆర్ఐఎఫ్ నిధుల విజ్ఞప్తి**

సేతు బంధన్ పథకం కింద తెలంగాణలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. అలాగే రాష్ట్రంలో చేపట్టాల్సిన 34 అభివృద్ధి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) కింద నిధులు మంజూరు చేయాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన గడ్కరీ, సంబంధిత కేంద్ర అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని విజ్ఞప్తి

తెలంగాణలోని పుల్లూరు--అలంపూర్--జట్రపోలు--పెంట్లవెల్లి--కొల్లాపూర్--లింగాల--అచ్చంపేట--డిండి--దేవరకొండ--మల్లేపల్లి--నల్గొండ మార్గాల్లోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. ఈ ప్రతిపాదనలపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

**ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు గడ్కరీకి ఆహ్వానం**

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్సీ ) సమావేశాలకు హాజరు కావాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించారు

# సరిహద్దులు దాటుతున్న భాషిణి బహుభాషా కృత్రిమ మేధ సేవలు ముస్సోరీ ఎన్‌సీజీజీ కార్యక్రమంలో ఆంగ్లం--స్పానిష్ మధ్య తక్షణ అనువాదం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 13 :**

వివిధ దేశాల ప్రభుత్వ అధికారుల మధ్య భాషా అడ్డంకులను తొలగించేందుకు భాషిణి బహుభాషా కృత్రిమ మేధ సేవలు తోడ్పడుతున్నాయి. ముస్సోరీలోని జాతీయ సుపరిపాలన కేంద్రం (ఎన్‌సీజీజీ) ఆధ్వర్యంలో అక్టోబరు 12 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న పట్టణ సేవల అందజేతపై సామర్థ్య నిర్మాణ కార్యక్రమంలో భాషిణి తక్షణ బహుభాషా సమాచార మార్పిడికి సహకారం అందిస్తోంది.కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌కు చెందిన డిజిటల్ ఇండియా భాషిణి విభాగం ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రాయోజకత్వంతో, పరిపాలనా సంస్కరణలు--ప్రజా ఫిర్యాదుల విభాగం పరిధిలోని ఎన్‌సీజీజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భారత సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం (ఐటీఈసీ) ద్వారా చేపడుతున్న అంతర్జాతీయ సామర్థ్య నిర్మాణ ప్రయత్నాల్లో ఇది భాగంగా ఉంది.పెరూ, కంబోడియా, నైజీరియా, కెన్యా, పాలస్తీనా, లెబనాన్, గాంబియా, ఈక్వెడార్, స్పెయిన్ తదితర దేశాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ రంగ ప్రతినిధులు ఇందులో పాల్గొంటున్నారు. పాలన, పట్టణ సేవల అందజేతలో అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తోంది.ప్రారంభ పరిచయ సమావేశంలో భాషిణి తన 'శ్రుత్‌లేఖ్' వేదిక ద్వారా ఆంగ్లం నుంచి స్పానిష్‌కు, స్పానిష్ నుంచి ఆంగ్లానికి తక్షణ అనువాద సేవలను



అందించింది. దీంతో భాషా భేదాలు ఉన్నప్పటికీ విదేశీప్రతినిధులుపరస్పరంసంభాషించడంతోపాటు చర్చల్లో సమర్థంగా పాల్గొనగలిగారు.

మాటల ఆధారిత బహుభాషా కృత్రిమ మేధకు ప్రాధాన్యమిచ్చే భాషిణి విధానానికి ఈ వినియోగం ఉదాహరణగా నిలిచింది. వాక్కు ఆధారిత సాంకేతికతతో సమాచార మార్పిడిని, డిజిటల్ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే దీని లక్ష్యం. అంతర్జాతీయ సహకారం, ప్రభుత్వ రంగ అధికారుల సామర్థ్యాభివృద్ధిలో కృత్రిమ మేధ ఆధారిత భాషా పరిష్కారాల ఉపయోగాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

భాషిణి బృందం పాల్గొనే ప్రతినిధులకు శ్రుత్‌లేఖ్ వినియోగంపై సహకారం అందించింది. భాషిణి వ్యవస్థ, బహుభాషా కృత్రిమ మేధ సామర్థ్యాలు, వైద్యం, ఆర్థిక సేవలు, వ్యవసాయం, ప్రజా సేవల అందజేత వంటి రంగాల్లో వాటి ఉపయోగాలను వివరించింది. రోజువారీ సంభాషణలు, డిజిటల్ కార్యకలాపాల్లోభాషాఅడ్డంకులనుఅధిగమించేందుకు భాషిణి మొబైల్ యాప్‌లోని సదుపాయాలను పరిశీలించాలని ప్రతినిధులను ప్రోత్సహించింది.

అక్టోబరు 23న ముగిసే ఈ కార్యక్రమం అంతటా నిర్వహణ అవసరాలకు అనుగుణంగా శ్రుత్‌లేఖ్ సేవలను అందుబాటులో ఉంచనున్నారు. విభిన్న సంస్కృతుల మధ్య సంభాషణలను బలోపేతం చేయడం, విజ్ఞాన మార్పిడిని సులభతరం చేయడం, అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమాల్లో అందరి భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో ఈ సాంకేతికతకు ఉన్న అవకాశాలను ఈ కార్యక్రమం వెల్లడిస్తోంది.

**భాషిణి సేవల విస్తరణ**

డిజిటల్ ఇండియా భాషిణి విభాగం డేటాసెట్లు, కృత్రిమ మేధ నమూనాలు, అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌లు (ఏపీఐలు), బహుభాషా యాప్‌ల ద్వారా దేశంలో భాషా కృత్రిమ మేధ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. భారత భాషా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయంగా డిజిటల్ వేదికలు, సేవల్లో భాషా సాంకేతికతలను అనుసంధానించేందుకు భాషిణి తోడ్పడుతోంది.

ఇప్పటివరకు 800కు పైగా ప్రభుత్వ వెబ్‌సైట్లతో సహా మొత్తం 2,353 ప్రభుత్వ డిజిటల్ వేదికల్లో భాషిణి ఆధారిత భాషా సాంకేతికతలను అనుసంధానించారు. ఈ వేదిక పాఠ్య రూపంలో 36 భారతీయ భాషలకు, వాక్కు రూపంలో 23 భారతీయ భాషలకు, అలాగే 35 అంతర్జాతీయ భాషలకు మద్దతు ఇస్తోంది. ఇప్పటివరకు 900 కోట్లకు పైగా కృత్రిమ మేధ ఆధారిత ప్రాసెసింగ్ అభ్యర్థనలను నిర్వహించింది. రోజుకు 2.4 కోట్లకు పైగా అభ్యర్థనలను ప్రాసెస్ చేస్తూ, భాషా సాంకేతికత ద్వారా డిజిటల్ సేవలను మరింత మందికి చేరువ చేస్తోంది.

# ఈశాన్య భారత అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకం మిజోరం విశ్వవిద్యాలయ విద్యార్థులతో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముఖాముఖి



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 13 :**

ఈశాన్యభారతదేశంగొప్పసాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలతోపాటువిస్తృతఅభివృద్ధిఅవకాశాలను కలిగి ఉందని కేంద్ర కమ్యూనికేషన్ల ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా అన్నారు. మిజోరంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం మిజోరం విశ్వవిద్యాలయ విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేపట్టిన 'అష్టలక్ష్మి దర్శన్' కార్యక్రమం కింద గోవా, చండీగఢ్ నుంచి ఈశాన్య ప్రాంత పర్యటనకు వచ్చిన విద్యార్థులతోనూ మంత్రి ముచ్చటించారు. వారి పర్యటన అనుభవాలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సింధియా మాట్లాడుతూ, ఇటువంటి పరస్పర పర్యటనలు ఈశాన్య ప్రాంతంపై యువతకు అవగాహన పెంచుతాయని పేర్కొన్నారు. సాంస్కృతిక బంధాలు, పరస్పర అవగాహన, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో ఇవి దోహదపడతాయని చెప్పారు.

ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలను దేశానికి 'అష్టలక్ష్మి'గా అభివృద్ధి చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈశాన్య ప్రాంత సాంస్కృతిక వైవిధ్యాన్ని, అభివృద్ధి అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఇది అవకాశం కల్పిస్తోంది.

గత ఏడాది కాలంలో 590 మందికి పైగా విద్యార్థులు అష్టలక్ష్మి దర్శన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఈశాన్య ప్రాంతానికి, దేశంలోని ఇతర ప్రాంతాలకు మధ్య అనుబంధం మరింత బలపడుతోంది.

'వికసిత్ భారత్--2047' లక్ష్యాలకు అనుగుణంగా యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ఈ కార్యక్రమం కీలకమని సింధియా పేర్కొన్నారు. భారతదేశ వైవిధ్యాన్ని గౌరవిస్తూ, దేశ అభివృద్ధి ప్రయాణంలో ఈశాన్య ప్రాంత పాత్రను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

యువత భాగస్వామ్యం, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించేందుకు ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని ఈ ముఖాముఖి కార్యక్రమం చాటిచెప్పింది. మరింత అనుసంధానమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తోడ్పడేలా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చింది.

# నవంబర్ 1న జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష అక్టోబర్ 12 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (నేషనల్ మీన్స్ -కం -మెరిట్ స్కాలర్షిప్-- చీవీమీ) పరీక్షను నవంబర్ 1, 2026 (ఆదివారం) నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెల్లడించింది.

ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుంది. పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అక్టోబర్ 12, 2026 నుంచి తమ హాల్‌టికెట్లను అధికారిక వెబ్‌సైట్ ష్ట్రజూ://ఎంవ్.వశ్రీఖఅస్త్రుఖఞ.స్త్రశీజ.ఱఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఉపయోగించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం సూచించింది.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం, అక్టోబర్,14, 2026
www.trinetnews.com

## ప్రతికూల వాతావరణంలోనూ సోయాబీన్ అధిక దిగుబడి

## ఎన్ఆర్సీ 268, ఎన్ఆర్సీ 270 రకాలతో హెక్టారుకు సుమారు 20 క్వింటాళ్లు



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ మెరుగైన సోయాబీన్ రకాలు ఆశాజనక దిగుబడిని కనబరిచాయి. ఇండోర్‌లోని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్)--జాతీయ సోయాబీన్ పరిశోధనా సంస్థ అభివృద్ధి చేసిన ఎన్ఆర్సీ 268, ఎన్ఆర్సీ 270 రకాలు హెక్టారుకు సుమారు 20 క్వింటాళ్ల దిగుబడి ఇచ్చే అవకాశమున్నట్లు ప్రాథమిక గణాంకాలు వెల్లడించాయి. అక్టోబర్ 9న సంస్థ నిర్వహించిన సోయాబీన్ పంట కోత దినోత్సవంలో ఈ రెండు రకాల దిగుబడి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఒక్కో రకాన్ని సాగు చేసిన ఒక్కో ఎకరం విస్తీర్ణంలో పంట కోసి సేకరించిన వివరాల ఆధారంగా హెక్టారుకు దిగుబడిని అంచనా వేశారు. ప్రస్తుతం దేశంలో సోయాబీన్ సగటు ఉత్పాదకత హెక్టారుకు సుమారు 10--11 క్వింటాళ్లుగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాథమిక ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

జాతీయ సోయాబీన్ పరిశోధనా సంస్థ, అఖిల భారత సమన్వయ సోయాబీన్ పరిశోధనా ప్రాజెక్టు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన పరిశోధనలు, ప్రయోగాల ప్రకారం మెరుగైన విత్తన రకాలు, తగిన సాగు సాంకేతికతలను అనుసరిస్తే హెక్టారుకు 15--20 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. అనుకూల పరిస్థితుల్లో ఇది సుమారు 22--25 క్వింటాళ్ల వరకు చేరే అవకాశముంది.

ఈ ప్రాథమిక ఫలితాలను వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం (డేర్) కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ ప్రశంసించారు. దేశంలో సోయాబీన్ ఉత్పాదకత పెంపునకు మెరుగైన రకాలు, శాస్త్రీయ సాగు పద్ధతులు కీలకమని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణంలోనూ హెక్టారుకు సుమారు 20 క్వింటాళ్ల దిగుబడి సూచనలు కనిపించడం ప్రోత్సాహకరమన్నారు. దిగుబడి గణాంకాల శాస్త్రీయ విశ్లేషణ భవిష్యత్ పరిశోధన వ్యూహాలకు దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. పంట కోత సందర్భంగా సేకరించిన వివరాలను ఒకే ఏడాది దిగుబడి అంచనాకు పరిమితం చేయకుండా, దీర్ఘకాలికంగా విశ్లేషించాల్సిన అవసరముందని సంస్థ డైరెక్టర్ పేర్కొన్నారు. అనేక సంవత్సరాల గణాంకాలను క్రమబద్ధంగా సేకరించడం ద్వారా వివిధ ప్రాంతాలు, విత్తన రకాలు, సాగు పరిస్థితుల్లో ఉత్పాదకత మార్పులను అర్థం చేసుకోవచ్చన్నారు. పరిశోధనలు, సాంకేతికత విస్తరణ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికీ ఈ సమాచారం ఉపయోగపడుతుందని వివరించారు.

అధిక దిగుబడినిచ్చే రకాలు, శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు సంస్థ ఇటువంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. తాజా పంట కోత గణాంకాలను మరింత విశ్లేషించి, ఆయా రకాల పనితీరు, సాగు పరిస్థితుల ప్రభావంపై స్పష్టమైన అంచనాలు రూపొందించనున్నట్లు సంస్థ తెలిపింది.

## ఈ--వ్యర్థాల నిర్వహణపై ఎంసీఎల్ ప్రత్యేక చర్యలు

## స్పెషల్ క్యాంపెయిన్ 6లో భాగంగా 73 ప్రదేశాల్లో పరిశుభ్రత పనులు




**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా సేకరించి, రీసైక్లింగ్‌కు తరలించేందుకు మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) ప్రత్యేక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ 6లో భాగంగా సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు కార్యకలాపాలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో ఈ--వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, పర్యావరణ అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం అక్టోబర్ 31 వరకు కొనసాగనుంది.

నిరుపయోగంగా మారిన ఎలక్ట్రానిక్ వస్తువుల సేకరణకు సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కియోస్క్‌లు ఏర్పాటు చేశారు. సేకరించిన వ్యర్థాలను అధీకృత రీసైక్లింగ్ సంస్థల ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన కార్యాలయం, ఇతర కార్యక్షేత్రాల్లోని ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఈ--వ్యర్థాలను సక్రమంగా పారవేయకపోతే నేల, నీరు కలుషితమవడంతోపాటు మానవ ఆరోగ్యం, పర్యావరణానికి హాని కలుగుతుందనే అంశాలపై ఉద్యోగులు, సమీప సమాజాలకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమం అమలు తొలి వారంలో గుర్తించిన 240 ప్రదేశాల్లో 73 ప్రదేశాలను శుభ్రపరిచారు. మొత్తం 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని శుభ్రపరచాలనే లక్ష్యానికి గాను 3,06,663 చదరపు అడుగుల్లో పరిశుభ్రత పనులు పూర్తయ్యాయి. అలాగే 600 మెట్రిక్ టన్నుల స్క్రాప్‌ను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారీ గనుల యంత్రాలకు సంబంధించిన 350 బ్యాటరీలను స్క్రాప్‌గా విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరింది.

కార్యాలయ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, బాధ్యతాయుత ఈ--వ్యర్థాల నిర్వహణకు సంస్థ కట్టుబడి ఉందని ఎంసీఎల్ తెలిపింది. వనరులను సమర్థంగా వినియోగిస్తూ పరిశుభ్రమైన, సుస్థిర భవిష్యత్తు సాధించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని పేర్కొంది.

## వికసిత్ భారత్‌కు పటిష్ఠ గణాంక వ్యవస్థ కీలకం

## డేటా నాణ్యతపైనే నిర్ణయాలు, అభివృద్ధి ఫలితాలు ఆధారపడి ఉంటాయి: పి.కె. మిశ్రా

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
'వికసిత్ భారత్--2047' లక్ష్యాన్ని సాధించేందుకు విశ్వసనీయమైన, పటిష్ఠమైన గణాంక వ్యవస్థ అవసరమని ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.కె. మిశ్రా పేర్కొన్నారు. గణాంకాలు కేవలం పరిపాలనా అవసరం మాత్రమే కాకుండా దేశానికి వ్యూహాత్మక సంపద అని స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన రాష్ట్రాల ప్రణాళిక, ఆర్థిక, ఐటీ శాఖల కార్యదర్శుల సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో గణాంకాలు, డేటా, సాంకేతికత, ప్రణాళిక, పాలన పరస్పరం అనుసంధానమై ఉన్నాయని మిశ్రా తెలిపారు. రాష్ట్రాలు, జిల్లాల్లో అభివృద్ధి పురోగతిని కొలవడం, విధానాల ఫలితాలను అంచనా వేయడం, లోటుపాట్లను గుర్తించడం, ప్రజా వనరులు నిర్దేశిత ఫలితాలను అందిస్తున్నాయో తెలుసుకోవడంలో గణాంక వ్యవస్థ కీలకమన్నారు. సరిగ్గా కొలవలేని అంశాలను సమర్థంగా నిర్వహించడం, సుస్థిర మార్పు సాధించడం కష్టమని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో డిజిటలీకరణ, వ్యవస్థీకరణ, పరస్పర అనుసంధానం పెరుగుతున్న నేపథ్యంలో గణాంక పద్ధతులూ మారాలని సూచించారు. 2022--23ను ఆధార సంవత్సరంగా తీసుకున్న కొత్త జాతీయ ఖాతాల శ్రేణి, నవీకరించిన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ), పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) శ్రేణులు మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా గణాంకాలను రూపొందించడంలో ముఖ్యమైన అడుగులని తెలిపారు. దేశ అభివృద్ధిలో రాష్ట్రాల పాత్ర ప్రధానమని, విధానాల అమలు, ఆర్థిక కార్యకలాపాలు, ప్రజలకు అభివృద్ధి ఫలితాలు అందడం రాష్ట్రస్థాయిలోనే జరుగుతాయని మిశ్రా అన్నారు. అధికారిక గణాంకాల నాణ్యత పెంపునకు రాష్ట్ర గణాంక వ్యవస్థల సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు కేంద్ర--రాష్ట్ర సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థలు, ఉపగ్రహ చిత్రాలు, అధునాతన విశ్లేషణలు గణాంకాల సకాల లభ్యత, కచ్చితత్వం, ఉపయోగాన్ని పెంచగలవని వివరించారు. అయితే అవి నాణ్యమైన గణాంకాలకు ప్రత్యామ్నాయం కాలేవని స్పష్టం చేశారు. వేగం కోసం కచ్చితత్వాన్ని, డేటా వినియోగం కోసం గోప్యతను రాజీపడకూడదన్నారు. సాంకేతికత వినియోగంలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. గణాంకాలు సహకార సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేస్తాయని మిశ్రా పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఫలితాలను పోల్చుకోవడానికి, ఉత్తమ పద్ధతులను గుర్తించడానికి, ప్రాంతీయ వ్యత్యాసాల నుంచి నేర్చుకోవడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. 2047 లక్ష్యం వైపు సాగుతున్నప్పుడు జాతీయ సగటు గణాంకాలతో సరిపెట్టుకోకుండా రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయిల్లో సమగ్ర వివరాలు సేకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎంఓఎస్‌పీఐ, రాష్ట్ర గణాంక కార్యాలయాలు, ఆర్థిక, ప్రణాళిక, ఐటీ శాఖలు, నీతి ఆయోగ్, విద్యాసంస్థలు, ఇతర భాగస్వాములు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశ్వసనీయత, పారదర్శకత, సాంకేతిక సామర్థ్యం, పరస్పర సమాచార అనుసంధానం, విధాన రూపకల్పనకు ఉపయోగపడే లక్షణాలతో కూడిన గణాంక వ్యవస్థ దేశ పరివర్తనను కొలవడమే కాకుండా వేగవంతం చేయడానికీ తోడ్పడుతుందని పేర్కొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై మానవతా పరిమళం.. భక్తులకు సేవే దైవసేవ





**విజయవాడ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
దసరాశరన్నవరాత్రిఉత్సవాలసందర్భంగాఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భక్తులకు స్వచ్ఛంద సంస్థలు, యువ వాలంటీర్లు సేవలందిస్తూ మానవతా విలువలను చాటుతున్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు పసిపిల్లలకు వేడి పాలు అందిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, వివిధ కళాశాలల వాలంటీర్లు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అవసరమైన సహాయం అందిస్తూ, వృద్ధులు, మహిళలు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచారు.

**అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఉత్సవాల నిర్వహణను సమన్వయం చేస్తోంది. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపడుతున్నారు.

దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శీనా నాయక్ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా గాంధీ కూడా ఏర్పాట్లలో భాగస్వాములవుతున్నారు.

నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో భక్తుల భద్రత, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. అధికారుల సమన్వయం,స్వచ్ఛందసంస్థలసేవలతో ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి.

## అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డ జగన్... నేడు ఓటమి భయంతో ఎన్నికల్నే రాజకీయం చేస్తున్నాడు : ప్రత్తిపాటి

**2021 ఎన్నికల నోటిఫికేషన్ పై హైకోర్టు వ్యాఖ్యల్ని జగన్ మర్చిపోయినా.. ప్రజలు మర్చిపోలేదు.**
**ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగితే, వైసీపీ గెలవదని జగన్ కు తెలుసు**
**కారుచోల, గుత్తావారిపాలెంలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట రూరల్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
సార్వత్రికమైనా, స్థానిక ఎన్నికలైనా కూటమే విజయం సాధిస్తుందని, ప్రజాస్వామ్యబద్ధంగా స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగితే వైసీపీకి డిపాజిట్లు రావని జగన్ కు అర్థమైందని,తనఅసమర్థతను,భయాన్నికప్పిపుచ్చుకుంటూ, ఓటమి భయంతోనే ఆయన ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నాడని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు.

మంగళవారం ఆయన యడ్లపాడు మండలం కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్లో పర్యటించారు. కారుచోలలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, రూ.6 లక్షలతో మరమ్మతులు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం గుత్తావారిపాలెంలో రూ. 10 లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.

**తన హయాంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో జగన్ మర్చిపోతే ఎలా?**

తన ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో జగన్ మర్చిపోయినా... ప్రజలు మర్చిపోలేదని, ఆనాడు నామినేషన్ల ప్రక్రియ మొదలు, ఫలితాల వరకు జరిగిన దారుణాలు మాటల్లో చెప్పలేనివన్నారు. 2021లో విడుదలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ పై నాటి హైకోర్టు చేసిన వ్యాఖ్యల్ని జగన్ ఒకసారి గుర్తుచేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ విధానాన్ని తప్పుపడుతూ, 'డెమోక్రటిక్ బ్యాక్ స్లైడింగ్' అనే పదాన్ని ఎందుకు వాడారో జగన్ సమాధానం చెప్పాలన్నారు. పారామిలటరీ బలగాల పర్యవేక్షణ... వెబ్ కాస్టింగ్, సీసీటీవీ లైవ్ లు ఏర్పాటు చేయాలంటున్న జగన్.. తన ప్రభుత్వంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఇవన్నీ ఎంత సమర్థవంతంగా అమలుచేశాడో చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్‌చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి.. ప్రజల మద్దతు లేదని తెలిసినప్పుడు ప్రభుత్వంపై నిందలేయడం జగన్ కే చెల్లిందని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తన జేబుసంస్థగా మార్చుకొని ముఖ్యమంత్రిగా ఆనాడు జగన్ నిర్వహించిన స్థానిక ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్య నాణ్యతను మసకబార్చాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి, ప్రజాబలంతో తిరుగులేని విజయం సాధించి, మరోసారి చరిత్ర సృష్టిస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. నిన్నటి వరకు బీసీ రిజర్వేషన్ల ముసుగులో కోర్టుల్లో తప్పుడు పిటిషన్లు వేసిన జగన్.. నేడు ఎన్నికల నిర్వహణ అంశాల్ని రాజకీయం చేస్తూ న్యాయస్థానాల్ని తప్పుదారి పట్టిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తంచేశారు. జగన్ తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు ఉందని ఆయన ఎద్దేవాచేశారు.

కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు మద్దూరి వీరారెడ్డి, వీరాంజనేయులు, గౌస్, సద్దాం, మునాఫ్, బుడే, వెంకట కోటయ్య, కరిముల్లా, శ్రీ రామ్మూర్తి, సాంబశివరావు, శివరామకృష్ణ , డి.యం.హెచ్.ఓ. మన్మోహన్, ఎమ్మార్వో విజయ శ్రీ, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చర్మ వ్యాధుల చికిత్సకు ఆయుష్ మార్గదర్శకాలు

## ఆయుర్వేదం, సిద్ధ, యునానీ, హోమియోపతి విధానాలకు ప్రమాణాలు.. యోగాకూ చోటు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
చర్మ వ్యాధుల చికిత్సలో ఏకరూపత, నాణ్యత పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రామాణిక చికిత్స మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆయుర్వేదం, సిద్ధ, యునానీ, హోమియోపతి వైద్య విధానాలతోపాటు యోగాను కూడా ఇందులో చేర్చింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) ఆయుష్ విభాగం ఈ మార్గదర్శకాలను రూపొందించింది.

సోరియాసిస్, డెర్మటైటిస్, బొల్లి, దద్దుర్లు, ఫంగస్ వల్ల వచ్చే చర్మ వ్యాధుల నివారణ, నిర్ధారణ, చికిత్స, తదుపరి పర్యవేక్షణ, పునరావాసంపై ఆయా వైద్య విధానాలకు అనుగుణంగా సూచనలు పొందుపరిచారు. 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ మార్గదర్శకాలు జాతీయ ఆరోగ్య వ్యవస్థలో ఆయుష్ వైద్య విధానాల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తాయని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ప్రతాప్‌రావు జాధవ్ పేర్కొన్నారు. సంప్రదాయ వైద్య విధానాల ప్రత్యేకతలను ఆధునిక శాస్త్రీయ ఆధారాలతో సమన్వయం చేసి, సాధారణ చర్మ వ్యాధులకు సురక్షితమైన, సమగ్రమైన వైద్య సేవలు అందించేందుకు ఇవి తోడ్పడతాయని తెలిపారు.

ఆయుష్ వైద్య సేవల్లో ప్రమాణీకరణ, నాణ్యత, శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడిన చికిత్సను ప్రోత్సహించడంలో ఈ మార్గదర్శకాలు కీలక ముందడుగని ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేశ్ కొటేచా అన్నారు. ప్రతి వైద్య విధానంలోని మౌలిక సూత్రాలను కాపాడుతూ, వైద్యులు చికిత్సపై సముచిత నిర్ణయాలు తీసుకునేలా ఆచరణాత్మక సూచనలు రూపొందించినట్లు వివరించారు. వివిధ వైద్య విభాగాల సమన్వయంతో రోగి అవసరాలకు ప్రాధాన్యమిచ్చే సేవలు అందించేందుకు ఇవి ఉపయోగపడతాయని ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ లోవ్‌నీష్ జి. కృష్ణ పేర్కొన్నారు.

ఆయుష్ పరిశోధనా మండళ్లు, ఆయుర్వేదం, సిద్ధ, యునానీ, హోమియోపతి విద్యా నిపుణులు, యోగా నిపుణులు, ఆధునిక వైద్య నిపుణులు మార్గదర్శకాల రూపకల్పనలో భాగస్వాములయ్యారు. సంప్రదాయ వైద్య గ్రంథాల సమీక్ష, సమకాలీన శాస్త్రీయ ఆధారాల పరిశీలన, నిపుణుల సంప్రదింపుల అనంతరం వీటికి తుది రూపమిచ్చారు.

వాస్తవ వైద్య పరిస్థితుల్లో మార్గదర్శకాల అమలు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించారు. ఢిల్లీ ప్రభుత్వ ఆయుష్ డైరెక్టరేట్ సహకారంతో ప్రాథమిక, ద్వితీయ స్థాయి ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల ద్వారా చికిత్స విధానాలను పరీక్షించారు. వారి సూచనలను తుది మార్గదర్శకాల్లో చేర్చారు.

వైద్యుల సామర్థ్య పెంపు, బోధన, పరిశోధనతోపాటు చికిత్స నిర్ణయాలకు ఈ పత్రాలు ఉపయోగపడతాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆయుష్ వైద్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విధాన రూపకర్తలకు ఇవి ప్రామాణిక సమాచార వనరులుగా నిలుస్తాయని పేర్కొంది.

## పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

## 32,976 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ నిధుల విడుదల

**హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిలకు మరో రూ.14.68 కోట్లు**

**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

**హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు రూ.14.68 కోట్లు**

ఇదిలా ఉండగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల విద్య, సంక్షేమానికి అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు, అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా తెలంగాణ ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.

## రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని మైతాపూర్, వీరాపూర్, రామాజీపేట, మూటపల్లి గ్రామాలతో పాటు రాయికల్ పట్టణంలో నిర్వహించిన దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాల్లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ , మున్సిపల్ చైర్మన్ రవి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలు, రాయికల్ పట్టణంలోని దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



## చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి..రజక సంఘం డిమాండ్.





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

మెదక్ జిల్లా కేంద్రంలో వెల్కమ్ బోర్డు దగ్గర గల చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గత రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం చిన్న శంకరంపేట మండలం అంబాజీపేటలో రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ చేగుంట--మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. సమాజం గర్వించదగిన పోరాట యోధురాలి విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా విరమింపజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అంబాజీపేట రజక సంఘం నాయకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి చంద్రం, మండల రజక సంఘం నాయకులు సిద్ధిరాములు, వెంకటేష్, నర్సింలు, లక్మణ్, నాగరాజు, శ్రీనివాస్, లింగం, మధు, నరేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి..రజక సంఘం డిమాండ్...

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :



మెదక్ జిల్లా కేంద్రంలో వెల్కమ్ బోర్డు దగ్గర గల చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గత రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం చిన్న శంకరంపేట మండలం అంబాజీపేటలో రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ చేగుంట--మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. సమాజం గర్వించదగిన పోరాట యోధురాలి విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా విరమింపజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అంబాజీపేట రజక సంఘం నాయకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి చంద్రం, మండల రజక సంఘం నాయకులు సిద్ధిరాములు, వెంకటేష్, నర్సింలు, లక్మణ్, నాగరాజు, శ్రీనివాస్, లింగం, మధు, నరేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## రామాజీపేట వేల్మ సంఘ భవవన నిర్మాణానికి రెండు లక్షల రూపాయల విరాళం ఇచ్చిన ఉడతల భాస్కరరావు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట వేలుమా సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త ఉడుతల భాస్కరరావు 2 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు రాష్ట్ర వెలుమా ఆత్మీయ సమ్మేళనంలో ఇచ్చిన మాట ప్రకారం విరాళం అందించారు సామాజిక ఐక్యత సంఘాల అభివృద్ధి లక్ష్యంగా ఆయన చేస్తున్న సేవలను సంఘ సభ్యులు అభినందించారు ఈ సందర్భంగా ఉడుతల భాస్కర రావు సేవలు మరువలేము అని వారన్నారు

ఈ సందర్భంగా దుగ్యాల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ సంఘ భవనం నిర్మించాలని రెండు గుంటల స్థలాన్ని రామాజీపేట నుండి వీరాపూర్ రోడ్ లో ఆరు లక్షల రూపాయలతో కొనుగోలు చేశామని దాతలు సహకారంతో సంఘ భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఎంపీ ధర్మపురి అరవింద్ భావన నిర్మాణానికి సహాయం చేయాలని ఈ సందర్భంగా సాగర్ రావు కోరారు ఈ కార్యక్రమంలో రామాజీపేట వెలుమా సంక్షేమ సంఘం



సభ్యులు దుగ్యాల విద్యాసాగర్ రావు, యాచమనేని వెంకట రామారావు, జక్కిలేటి రాజేశ్వరరావు, యాచమనేని అజయ్ రావు, జకిలేటి రాజేశ్వరరావు, యాచమనేని అజయ్ రావు, దుగ్యాల రామ్ సాగర్ రావు, దుగ్యాల వేణు రావులు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సరఫరా సజావుగా కోతలు లేకుండా అదనంగా 3 గంటల విద్యుత్ ఇవ్వాలని కలెక్టర్ కు వినతి కలెక్టర్ వినతి పత్రం అందజేస్తున్న రైతు రక్షణ సమితి అధ్యక్షుడు మైసయ్య యాదవ్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ అధ్యక్షతన ఈరోజు మెదక్ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది జిల్లాలో విద్యుత్ వ్యవసాయానికి అంతారాయం కోతల వల్ల పంటలు ఎండిపోవడం ఆరంభమైనందున ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు పడకపోవడంతో రైతులు వేసిన పంట జిల్లాలో కరెంటు కోతల వల్ల పంటలు ఎండిపోవడం ప్రారంభమైనందున రైతులకు విద్యుత్ అదనంగా రెండు మూడు గంటలు పెంచి కోతలు లేకుండా 15 నుంచి 20 రోజుల వరకు విద్యుత్తి అందిస్తే జిల్లాలో 70 శాతం వరి పంటలు పండుతాయని మైసయ్య యాదవ్ అన్నారు విద్యుత్తి కోతల వల్ల 50 శాతం పంటలు ఎండిపోయే అవకాశం ఉన్నందున రైతులు జిల్లాలో అన్ని సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు రోడ్లపైకి రావడం రైతులు తీవ్రంగా ధర్నాలు చేసే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్



గారు వెంటనే కరెంటు అధికారులకు ఆదేశాలు ఇచ్చి కోతలు లేకుండా చూడాలని తెలంగాణ రైతు రక్షణ సమితి కార్యావర్గ సభ్యులు కోరారు. కలెక్టర్ విద్యుత్ కోతలు లేకుండా చూస్తానని అన్నారు. కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు వెంటనే రాష్ట్ర విద్యుత్ అధికారులకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చి కోతలు లేకుండా గత 15 నుంచి 20 రోజుల వరకు అదనంగా రెండు మూడు గంటలు కరెంటు పెంచి పంటలు ఎండిపోకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ నెల చివరి వరకు చేతికొచ్చిన వరి పంటను కొనుగోలు కేంద్రాల వద్ద వచ్చిన ధాన్యాన్ని రెండు మూడు రోజుల్లో కొనేలా ప్రభుత్వం జిల్లా కలెక్టర్ గారి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారిని రైతుల పక్షాన సంఘం పక్షాన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్ జిల్లా ముఖ్య సలహాదారులు ఎల్లం యాదవ్ జిల్లా కార్యదర్శి సభ్యులు పరశురాం పెద్దకోళ్ల మల్లేష్ నారాయణ ఏసయ్య రైతులు పాల్గొన్నారు.

## బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి
## గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

మంగళవారం బాసరలో పర్యటించిన కలెక్టర్, ముందుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించాలని సూచించారు. ఆలయ నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతలో ఎలాంటి రాజీ



లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి నది తీరంలోని పుష్కర ఘాట్లను పరిశీలించి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని, వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను నిర్దేశితగడువులోగాపూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.





ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు,

## శ్రీ షిరిడి సాయి సన్నిధిలో వైభవంగా శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ చైర్మన్ మంచికంటి ధనంజయ ఆధ్వర్యంలో మూడవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులచే కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం ఘనంగా జరిగాయి. అనంతరం సాయినాథునికి 108 కలశాల నెయ్యితో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీమతి వావిలాల నాగరాణి భాగవతారిణి ఆలపించిన 'శివలీలలు' హరికథాగానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కురుమిశెట్టి వెంకటయ్య, ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శీను,



ఆలయ పూజారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి, సాయిబాబాల కృపాకటాక్షాలు పొందారు.

## కనక దుర్గ కమ్యూనిటీ దసరా మహోత్సవాలకు శ్రీరామ్ చినబాబుకు ఆహ్వానం




ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

మదనపల్లె పట్టణంలోని రామాలయం వీధి, కో-ఆపరేటివ్ సొసైటీ కాలనీలో అక్టోబర్ 20వ తేదీ నుంచి కనక దుర్గ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5వ వార్షికోత్సవం మరియు శ్రీ దసరా మహోత్సవాలకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ను కమ్యూనిటీ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.

## రాయికల్ శ్రీ లలితాంబిక మాత శక్తి పీఠము మూడో రోజు శ్రీ అన్నపూర్ణ దేవి మాత స్వరూపాశీ – ఐ హెచ్ ఆర్ పి సి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో స్థాపించబడిన శ్రీ శ్రీ లలితాంబిక మాత శక్తి పీఠము మూడో రోజు శ్రీ అన్నపూర్ణ దేవి మాత స్వరూపానికి అంగరంగ వైభవంగా అభిషేకము కుంకుమార్చన రుద్రహోమము జరుపబడింది చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు మాతలు వృద్ధులు పిల్లలు తండోపతండాలుగా తరలివచ్చారు భక్తులు వివిధ రకాల కోరికలు తీరుతున్నాయి ఇదే నమ్మకంతో నిత్యము భక్తుల రావడం జరుగుతుంది పురోహితులు మార్కండేయ



అధ్యక్షులు వేముల పద్మ,ఉపాధ్యక్షులు కాంతారావు, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి కృష్ణారెడ్డి, కోశాధికారి మిట్టపల్లి పరమేశ్వరి, జగదీశ్వర్ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు భాగ్య,కవిత,ప్రధాన కార్యదర్శి గంప ఆనందం,అనిల్ రెడ్డి, చింత ప్రకాష్,బిరుదు సుభాష్ రాజ్, వరలక్ష్మి మమతా రాణి,మోర ఉమా, ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ ప్రొటెక్షన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు సంగీత రాజమౌళి పాల్గొన్నారు

# పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ





**- గ్రామాలభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత**
**- చిన అమిరం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అంజిబాబు**

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

పల్లె ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెలకు మహర్దశ కానవచ్చిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పల్లె పండగ 3.0 లో భాగంగా మంగళవారం భీమవరం మండలం చిన అమిరం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. చిన అమిరం గ్రామంలో సిసి రోడ్లు, గ్రామ పార్కు, వాటర్ ట్యాంక్, పంచాయతీ ఆఫీసు వద్ద నిర్మించిన కాంక్రీట్ వాల్, పుంత రోడ్డు ప్రారంభోత్సవం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం గ్రామంలో రోడ్డను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపడుతోందని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామీణ మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో పల్లె పండుగ కార్యక్రమం కీలకంగా మారిందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ 3.0 లో భాగంగా రూ 11,085 కోట్లతో గ్రామాల్లో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:



పుంగనూరు పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు విశ్రాంత డీఎస్పీ, తెలుగుదేశం సీనియర్ నాయకుడు సుకుమార్‌బాబు సుమారు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. ఈ మేరకు విశ్రాంత డిఎస్పి సుకుమార్‌బాబు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రమశిక్షణ, పట్టుదల, చురుకుగాపనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు.
యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని సుకుమార్ బాబు అన్నారు. గతంలోనూ క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర క్రీడలకు అవసరమైన సామగ్రిని 50కిపైగా టీములకు అందించినట్లు ఆయన తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యువకులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తూ వస్తున్నానని, క్రీడా కిట్లు అవసరమైన వారు తనను సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు త్వరలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన క్రీడాకారులు గిరీష్, సాయి, ఈశ్వర్, పురుషోత్తం, నవీన్, వెంకటేష్, రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

**- అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి నక్క వెంకటేష్ యాదవ్**

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:




దేవరకొండ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ దేవరకొండ పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్ నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు, వైద్యులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.
మొదట కోర్టులోని న్యాయవాదులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ, అర్హత కలిగిన వారు నిర్ణీత నిబంధనల ప్రకారం తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.
అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై వివరించి, అర్హులైన వారు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.
ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హత కలిగిన వారు సంబంధిత నిబంధనలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై వివరాలు తెలుసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కో-కన్వీనర్ జల్దా భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, వనం పుష్పలత, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్ కుమార్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు చిలక రాజు బిక్కు, సముద్రాల సహదేవ్, గంజి హరి, ఇడం రవికుమార్, ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కనకయ్యకొట్టాల పాఠశాలకు రంగులు వేయించిన దొడ్డ సుధాకర్ చౌదరి

## రూ.40 వేల సొంత ఖర్చుతో పాఠశాల అభివృద్ధికి సహకారం గ్రామస్తుల హర్షం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:





జూపాడుబంగ్లా మండలంలోని, కనకయ్యకొట్టాల గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దొడ్డ సుధాకర్ చౌదరి తన సొంత ఖర్చుతో రంగులు వేయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల మొత్తం అందంగా కనిపించేలా రంగులు వేయించేందుకు ఆయన మొత్తం రూ.40,000 ఖర్చు చేశారు.
పాఠశాల అభివృద్ధి కోసం ఆయన చేసిన ఈ సేవా గ్రామంలో ప్రజల ప్రశంసలు అందుకుంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.
రంగుల, కూలీల, ఇతర ఖర్చులు మొత్తం రూ.40,000/- అయింది అన్నారు.
ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైదర్ బీ మాట్లాడుతూ పాఠశాలకు రంగులు వేయించి అభివృద్ధికి సహకరించిన దొడ్డ సుధాకర్ చౌదరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి పట్ల ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. దొడ్డ సుధాకర్ చౌదరి చేసిన ఈ సేవ అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శావ వెంకటయ్య, పాఠశాల చైర్మన్ పరమేశ్వరుడు, మాజీ చైర్మన్ బ్రహ్మయ్య ఆచారి, హరి, డాక్టర్ శివచారి, మద్దిలేటి, గుట్టుపల్లి పిచ్చయ్య, మంగలి మాలకొండయ్య, సామేలు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తాడేరు గ్రామం ను బాల్య వివాహ రహిత గ్రామం గా తీర్చిదిద్దుదాం.

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:




చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ట్రస్ట్ మరియు తాడేరు గ్రామపంచాయతీ వారు సంయుక్తంగా నిర్వహించిన బాల్యవివాహాల వ్యతిరేకం పై అవగాహన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు
బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే అత్యవసర టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా 112 కి కాల్ చేయాలని గ్రామ సెక్రెటరీ ఇ. అమృత్ గారు పిలుపునిచ్చారు అదేవిధంగా బాల్య వివాహాలు జరగకుండా గ్రామ బాల్య వివాహ నిర్మూలన అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలియజేశారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్ కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్, జూఔ. ఎం. ఝాన్సీ రాణి, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేష్ గారు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా ప్రజా దర్బార్ - సమస్యల పరిష్కారానికి ట్రిపుల్ ఆర్ ఆదేశం




ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు (ట్రిపుల్ ఆర్) ఆధ్వర్యంలో పెదమిరం పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రజా దర్బార్ ఘనంగా నిర్వహించారు.
ఈ ప్రజా దర్బార్ కు నియోజకవర్గం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు వంటి అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఉండిలో తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన రేషన్ డీలర్లు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:




రాష్ట్ర రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సమైక్య రూపొందించిన కార్యాచరణలో భాగంగా, ఉండి మండల రేషన్ డీలర్లు మంగళవారం ఉండి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో రాంప్రసాద్ రాజుకి వినతిపత్రం అందజేశారు.
రాష్ట్ర సమైక్య ఆదేశాల మేరకు ఈ వినతిపత్రాల అందజేత కార్యక్రమాన్ని చేపట్టామని, ఈ సందర్భంగా తమ సమస్యలను వివరిస్తూ రిప్రజెంటేషన్ అందజేశామని డీలర్లు తెలిపారు. డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ పెంపు, ఇతర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన పరిష్కరించకపోతే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని డీలర్ల సంఘం నాయకులు హెచ్చరించారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఉండి మండల రేషన్ డీలర్ల సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యపాన విముక్తిపై అవగాహన కార్యక్రమాలు





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

ఆకివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో మద్యపాన విముక్తిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
పాఠశాలలు మరియు గ్రామాలలో ఆకివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. మద్యపాన వ్యసనపరులైన వారికి విముక్తి పొందడానికి తీసుకోవలసిన చర్యలు, వాటికి సంబంధించిన డీ-అడిక్షన్ సెంటర్ల గురించి అవగాహన కల్పించారు.
మద్యపానం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలు, కుటుంబాల్లో ఏర్పడే ఇబ్బందులపై విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. యువత మద్యానికి బానిస కాకుండా మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీఐ ఏ.వాసు వేణి మరియు సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ మండలంలో అన్నపూర్ణా దేవి స్వరూపం లో పూజలు.

## శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపెల్లి, చింతలూరు ఒడ్డెలింగాపూర్ తదితర గ్రామాల్లో నెలకొల్పిన దుర్గా దేవి మండపాల్లో మంగళవారంఅందరికీ ఆహారపదార్థాలు అందించే తల్లి అన్నపూర్ణా దేవి స్వరూపంగా దుర్గామాత ప్రత్యేక పూజలు పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ పూజా కార్యక్రమాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఎలోనినో ప్రభావం తో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులు దేవి కృపతో తొలగిపోయి సుఖసంతోషాలు చేకూరాలని భక్తులు ఆకాంక్షించారు. ఆయా గ్రామాల్లో విగ్రహాదాతలు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని సేవా సమితి సభ్యులు,నవదుర్గా సమితి సభ్యులు అంబేద్కర్ సంఘం సభ్యులు,భవానీ దీక్ష స్వాములు,మహిళలు భక్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో జీవన్ రెడ్డి డ్యాన్సుల స్టెప్పులు వేయడంతో రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ నూతన ఉత్తేజం



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జగిత్యాలలో జరిగిన గులాబీమయములో బిఆర్ఎస్ కార్యకర్తలు ఉద్రుతలు కేరింతలతో చేస్తున్న డాన్సులకు తాను కూడా ఒక యువకుడై మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి జీవన్ రెడ్డి డ్యాన్స స్టెప్పుతో బీఆర్ఎస్ యువతను అనుసరిస్తూ డాన్స్ చేయడం పట్టణవాసులను ఆశ్చర్యానికి ముచ్చెత్తింది 70 పైచిలుకు వయసు ఉన్న గా ఒక యువకుడిగా జీవన్ రెడ్డి ఆనందానికి ఎల్లలు లేవు ఆనందంతో వారితో డాన్స్ చేయడం అంటే ఆయన ఉత్సవానికి హద్దులు లేకుండా పోయింది సిరిసిల్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తాను కూడా కార్యకర్తలను చూసి ఆనందంతో స్టెప్పులు వేసే విషయం మనకు తెలిసింది నేను ఆయన కన్నా నేను తక్కువ నాని డ్యాన్స్ వేయడం రాష్ట్రమంతా బిఆర్ఎస్ కార్యకర్తలకు నూతన ఉత్తేజాన్ని నింపింది

# ఏక కాలం లో ఉన్నత కొలువులు సాధించిన రంగు సాయికిరణ్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

ఆదర్శంగా నిలిచిన వ్యవసాయ కుటుంబంఐఐటీ కాన్పూర్ చదువుతూనే.ఎన్టీపీసీ, నాల్కోలో ఉద్యోగాలు సాధించిన రైతు బిడ్డ సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఓ గ్రామీణ యువకుడు జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. పట్టుదలతో చదివి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఏకకాలంలో రెండు ఉద్యోగాలకు ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచాడు.

మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రంగు సాయికిరణ్.. కేంద్ర ప్రభుత్య మహారత్న సంస్థ ఎన్టీపీసీ నవరత్న సంస్థ నాలకోలలో ఉన్నత కొలువుల సాధించి తన గ్రామానికి, జిల్లాకు గుర్తింపు తెచ్చాడు.

తెలుగు మీడియం నుంచి ఐఐటీ దాకా.సాయికిరణ్ పదో తరగతి వరకు గ్రాలోని విశ్వశాంతి విద్యాలయంలో పూర్తిగా తెలుగు మీడియంలోనే చదివాడు. ఆ తర్వాత ఇంటర్మీడియట్ ఖమ్మంలోని శ్రీ చైతన్య కళాశాలలో, హైదరాబాద్లోని విజ్ఞాన్ జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో బీటెక్ పూర్తి చేశాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్ పరీక్షలో ఆల్ ఇండియా 873వ ర్యాంకు సాధించి, దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థ అయిన ఐఐటీ కాన్పూర్ లో పవర్ ఇంజనీరింగ్ విభాగంలో ఎంటెక్ సీటు దక్కించుకున్నాడు.

చదువుతుండగానే

**వరించిన అవకాశాలు..**

ప్రస్తుతం ఐఐటీలో ఎంటెక్ పూర్తికాకముందే, గేట్ ప్రతిభ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్టీపీసీ, నాలక్టోలలో ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు సాయికిరణ్ ఎంపికయ్యాడు. సాధించిన విజయాలు..ఐఐటీ కాన్పూర్ పవర్ ఇంజనీరింగ్ విభాగంలో ఎంటెక్ సీటుగేట్ పరీక్షలో ఆల్ ఇండియా 873వ ర్యాంకు

ఎన్ టి పి సి లో ఎగ్జిక్యూటివ్ ఉద్యోగంనాల్కొ లో ఎగ్జిక్యూటివ్ ఉద్యోగంతల్లిదండ్రుల కష్టం.. అన్నయ్యా అండదండలతోనేసాయికిరణ్తల్లిదండ్రులువ్యవ సాయం చేస్తూ రేయింబవళ్లు కష్టపడే తల్లిదండ్రుల స్ఫూర్తి తోడు, తన విద్యాభ్యాసంలో ప్రతి అడుగులోనూ అన్నయ్య అందించిన నైతిక అండదండలతోనే తాను ఈ స్థాయికి చేరినట్లు సాయికిరణ్ సంతోషం వ్యక్తం చేశాడు. తెలుగు మీడియంలో చదివి జాతీయ స్థాయిలో సత్తా చాటడంతో పాటు, కుటుంబసభ్యుల కష్టాన్ని చూసి చే ఏకకాలంలో రెండు అత్యున్నత ఉద్యోగాలకు ఎంపికైన సాయికిరణ్గ్రామస్తులు, బంధువులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామీణ కుటుంబం నుంచి జాతీయ స్థాయిలో సత్తా చాటిన సాయికిరణ్ నిజంగా యువతకు ఆదర్శం.

# జగిత్యాల జిల్లా యువతకు, ఔత్సహిక ఫోటో గ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం – జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:



శాంతి భద్రతల మరియు సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా పెట్టి, పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21 నాడు జరుగు " పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా పోలీస్ రిలేటెడ్ అంశం మీద ఫోటో గ్రఫీ, షార్ట్ ఫిలిం తీయడానికి జిల్లాలో ఆసక్తి గల యువతక ఔత్సహిక ఫోటోగ్రాఫర్లు ముందుకు రావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు

ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తీసిన (3) ఫోటోలు,తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 23 వ తేదీ సాయంత్రంలోగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో అందజేయాలన్నారు. ఇట్టి షార్ట్ ఫిలిం 3 నిమిషాలు మించకూడదు, 10 × 8 సైజ్ ఫోటోలను, షార్ట్ ఫిలింను పెన్ డ్రైవ్ లో మీ యెక్క పూర్తి వివరాలతో అందజేయలని,జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలను, ఫోటోలను రాష్ట్ర స్థాయి పోటీల గురించి డీజీపీ ఆఫీస్ హైదరాబాదుకు పంపించడం జరుగుతుందన్నారు.

# గాయత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీశ్రీ తాళమ్మ అమ్మవారు



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

గూడూరు గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ తాళమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు విశేష దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండో రోజు ఉత్సవాలకు ఉభయకర్తలుగా శ్రీ పామూరు సందీప్సాగరిక దంపతులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో పాటు పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమాలనుశ్రీశ్రీశ్రీ తాళమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ చిట్టెం శ్రీనివాసులు గౌడ్,కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# మున్సిపల్ చైర్మన్ రిజర్వేషన్లలో గిరిజనులకు అన్యాయం చేస్తే సహించేది లేదు!

**- మా హక్కుల సాధన కోసం,న్యాయ పోరాటం చేస్తాం,**

**- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వానికి హెచ్చరిక**

**- మున్సిపల్ చైర్మన్ స్థానాల్లో గిరిజనులకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటాను కల్పించాలి. ప్రకటించిన 106 స్థానాల్లో 6 శాతం రిజర్వేషన్ ప్రకారం 7 స్థానాలు కేటాయించాల్సి ఉండగా, కేవలం 3 స్థానాలకే పరిమితం చేయడం అన్యాయం. మిగిలిన 4 స్థానాలను వెంటనే కేటాయించాలి.**





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ చైర్మన్ పదవుల రిజర్వేషన్ల కేటాయింపులో గిరిజనులకు అన్యాయం జరిగిందని, ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలన చేసి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు లివడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్అండ్బీ గెస్ట్హౌస్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 106 మున్సిపల్ చైర్మన్ స్థానాల్లో గిరిజనులకు 6 శాతం రిజర్వేషన్ ప్రకారం 7 స్థానాలు కేటాయించాల్సి ఉండగా, కేవలం 3 స్థానాలకే పరిమితం చేయడం వల్ల గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యానికి విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు.

మా హక్కులు ఎవరి దయాదాక్షిణ్యాలు కావు అవి రాజ్యాంగబద్ధమైన హక్కులు!

గిరిజనులకు న్యాయంగా దక్కాల్సిన స్థానాలను తగ్గించి కేటాయించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. గిరిజనులకు కేటాయించాల్సిన మిగిలిన నాలుగు స్థానాలను వెంటనే కేటాయించి, రిజర్వేషన్ల అమలులో ఉన్న లోపాలను సరిదిద్దాలని కోరారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

రిజర్వేషన్ల విషయంలో గిరిజనులకు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయం ఉండకూడదని ఆయన అన్నారు. స్థానిక సంస్థల్లో గిరిజనుల రాజకీయ భాగస్వామ్యం పెరగాలంటే రిజర్వేషన్లను నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల్లో 6 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మున్సిపల్ చైర్మన్ పదవులతో పాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, మున్సిపల్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, తదితర స్థానిక సంస్థల పదవుల్లోనూ గిరిజనులకు నిబంధనల ప్రకారం 6 శాతం రిజర్వేషన్ కల్పించి సామాజిక న్యాయం చేయాలని శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, 80 శాతం లేదా అంతకంటే ఎక్కువ గిరిజన జనాభా ఉన్న గ్రామాలు, తండాలు, గూడేలను ప్రత్యేక రెవిన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజనుల రాజకీయ హక్కులు, స్వయం పాలనలో భాగస్వామ్యం, రాజ్యాంగబద్ధమైన ప్రాతినిధ్యం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టపరంగా కొనసాగిస్తామని తెలిపారు.

గిరిజనుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రకటించిన రిజర్వేషన్లలో గిరిజనులకు న్యాయమైన వాటా కల్పించి, రాజకీయ ప్రాతినిధ్యానికి భరోసా కల్పించాలని వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో లాహోరీ బద్దు నాయక్, భూక్య ఉపాధ్యాయ, ధారావత్ బాలియా నాయక్, భూక్య శ్రీరాములు, బాణావత్ నాగరాజు తదితర గిరిజన నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

# పుంగనూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ ధీరజ్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:



రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం పుంగనూరు పట్టణంలో పర్యటించి పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ల భద్రతపై పోలీస్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాతో మాట్లాడుతూఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులను ఆయన ఆదేశించారు.

ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పట్టణంలోని నగిరి వీధిలోని పోలింగ్ కేంద్రం మార్పు అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు. అదేవిధంగా ఎవరైనా ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హెచ్చరించారు ఈ తనిఖీల్లో మదనపల్లె డీఎస్పీ ప్రసాద్, పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ అన్సర్ భాష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహితపూర్ దుర్గా మ్మకు 108 బోగాలు సమర్పించిన భక్తులు పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి... దావ వసంత. సురేష్.

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:



జగిత్యాల జిల్లాలో ని రాయికల్ మండలం లోని మహితపూర్ గ్రామ ములోని శ్రీ గిరి పర్వత ము పైన మరో విజయవాడ కనక దుర్గమ్మ ఆలయం నందు మూడో రోజు దుర్గమ్మ అన్నపూర్ణ దేవి అవతారం లో భక్తులు అందరికి మంచిగా కాను విందు జరిగేవిధమ్ముగా అలంకరణ ఆలయ అర్చకులు విశాల్ ఈశ్వర్. రంజిత్.ఎంతో ఆఅందము గా తయారు చేయడంతో అందరు చాలా సంతోషం వేలి బుచ్చురు.

దేవి నవరాత్రులు మరియు ప్రత్యేక రోజులలో దుర్గా మాత మరియు అన్నపూర్ణ మాత కు 108రకాల ప్రసాదాలు నైవేద్యం లు సమర్పించాడం. అత్యంత పవిత్రమైన ఆధారం గా భవిస్తారు. అన్నపూర్ణ దేవి సాక్షత్ ఆహారానికి పోషణకు అది దేవత కాబట్టి ఆమెకు ఈ నూట ఎనిమిది రకాల వంటకాలు సమర్పించి ఆ పై వచ్చిన భక్తులకు ప్రసాము గా పంచినారు..

ఈ రోజు అలంకరణ చూడ ముచ్చటగా సాక్షతూ శ్రీ అన్నపూర్ణ దేవి లాగా దర్శనం ఇచ్చేటట్లు అలంకరణ చేశారు ఈ రోజు కనక దుర్గా దేవి ఆలయం అన్నపూర్ణ దేవి అవతారం లో దర్శనం ఇచ్చారు మరియు ఇక్కడకి వచ్చిన వారందరికీ మైతపూర్ గ్రామస్తులు మాజీ జడ్పీటీసీ మాజీ ఎంపీటీసీ గోపి మాధవి రాజారెడ్డి మరియు వారి కుమారుడు ఆంజితు రెడ్డి రక్షిత లు ఈ రోజు వారి స్వంతం గా అన్నప్రాసదా వితరణ కార్యక్రమం జరిపించారు.వివిధ గ్రామములో నుండి వచ్చిన భక్తులు ప్రజలు మహిళలు అర్చకులు మఠం క్యాసునూరి జగదీశ్వర్ గారి ఆధ్వర్యంలో అర్చకులు విశాల్ ఈశ్వర్ రంజిత్ లు ఎంతో వైభవం గా భక్తురాళ్ల తో నూట ఎనిమిది రకాలుగా నైవేద్యం ప్రసాధములు తీసుకోని వచ్చిన వారందరి మరియు ఈరోజు మంగళవారం నాటి అన్నదాత అయినా గోపి మాధవి రాజారెడ్డి అంజిత్ రెడ్డి రక్షిత లతో ఎంతో ఘనంగా పూజ కార్యక్రమం నిర్వహించారు

ఈ రోజు కనక దుర్గా దేవి ఆలయం అన్నపూర్ణ దేవి అవతారం లో ఉన్న దుర్గ మ్మ ని మాజీ మంత్రి తాటి పత్రీ జీవన్ రెడ్డి మరియు జగిత్యాల తొలి జిల్లా పరిషత్ మాజీ చేర్మెన్ దావ వసంత సురేష్. మాజీ వైసు చేర్మెన్ హరిచరణ్ రావు. రాయికల్ మున్సిపల్ చేర్మెన్ కటుకం రవీందర్. వైస్ చేర్మెన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి. కౌన్సిలర్ లు ఎలిగేటి అనిల్, రాకేష్ నాయక్. బత్తిని మహేశ్వరీ, నాగరాజు, మరియు మైతపూర్ మాజీ సర్పంచ్ గన్నే రాధ రాయికల్ మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ మాజీ సర్పంచ్ గన్నే రాజారెడ్డి, ఐ ఎచ్ ఆర్ పి సి జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడెపు రాజ మావూళి గ్రామ ప్రముఖులు అన్నికులల సభ్యులు అందరు కలిసి దర్శనం చేసుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పలువురు నాయకులు భవాని దీక్ష స్వామి లు మాత స్వామి లు పాల్గొన్నారు.

# అన్నమయ్య సంకీర్తనలకు నృత్య నీరాజనం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:

అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా నాదబ్రహ్మోత్సవంలో భాగంగా మూడో రోజు దివ్య తేజస్విని బృందం ప్రదర్శించిన కూచిపూడి 'శ్రీనివాస కళ్యాణం' నృత్యరూపకం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. శ్రీనివాసుడు, పద్మావతి, లక్ష్మీదేవి పాత్రలతో పాటు సఖుల రూపాల్లో కళాకారులు తమ భావాభినయంతో ఆధ్యాత్మిక శోభను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు రామయోగి, వెంకట్ చెంగవల్లి పాల్గొని,అన్నమాచార్యుల సంకీర్తనల ద్వారా సమాజంలో ఆలోచనా కాలుష్యాన్ని తొలగించి ఆధ్యాత్మిక చైతన్యం తెస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభారాజు సంకల్పాన్ని, సంస్కృతిని సజీవంగా నిలుపుతున్న నృత్య బృందాన్ని కొనియాడారు. ఈ ఉత్సవాల్లో రోజూ లలితా, విష్ణు సహస్రనామ పారాయణాలు, సంగీత, నృత్య ప్రదర్శనలు, ప్రసాద వితరణ వైభవంగా కొనసాగుతున్నాయి.



# వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

పుంగనూరులో దసరా నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో అమ్మవారు వేపాకు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చకులు శ్రీనివాసులు, మురళి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, వేపాకుతో శ్రీ విరూపాక్షి మారెమ్మను శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన వేపాకుతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరించడంతోపాటు అమ్మవారిని సైతం వేపాకుతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారు దర్శనమిచ్చారు. అదేవిధంగా చౌడేపల్లి మండలం దిగువపల్లిలోని ప్రసిద్ధ శక్తి క్షేత్రం శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పుంగనూరు పట్టణంలోని కోనేటి వద్ద గల శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయంలో మూడవ రోజు ఉత్సవాల్లో భాగంగా అర్చకులు రాము ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ అన్నపూర్ణాదేవిని అన్నపూర్ణేశ్వరి దేవిగా ఆసీనులైన రూపంలో అలంకరించి, ప్రత్యేక అర్చనలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు

# రాష్ట్రంలో రాజకీయ పక్షాలతో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**



రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణపై చర్చించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఒక అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎ ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా నిష్పాక్షికంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన తగు చర్యలపై వివిధ పార్టీల అభిప్రాయాలను, సూచనలను ఎస్ఈసీ ఈ సమావేశంలో స్వీకరించింది.

ఈసమావేశంలోఎన్నికలసంఘంఉన్నతాధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని పార్టీల ప్రతినిధులు కోరారు.

# గెజిట్ నోటిఫికేషన్ తర్వాతే స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల: ఎస్ఈసి అనీల్ చంద్ర

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

రాష్ట్రంలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు తగిన రక్షణ, భద్రత కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసి) అనీల్ చంద్ర స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు.

ముందుగా ప్రభుత్వపరంగా రిజర్వ్ చేసిన స్థానాలను ఖరారు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, తాము ఎన్నికల నిర్వహణకు పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాతే తదుపరి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ఆయన స్పష్టంగా వెల్లడించారు. అంతేకాకుండా, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేదా అవాంఛనీయ సంఘటనలు ఎదురుకాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల అధికారులకు త్వరలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని



ఆయన హామీ ఇచ్చారు.

# ఏపీ నామినేటెడ్ పోస్టుల పదవీకాలం మరో రెండు నెలలు పెంపు




**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న నాయకులకు పండుగ వేళ ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, బోర్డులు, మరియు సంస్థల్లో కొనసాగుతున్న చైర్మన్లు, డైరెక్టర్లు, అలాగే ఇతర నామినేటెడ్ పదవుల కాలపరిమితిని మరో 2 నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన అభివృద్ధి పనులను ఎలాంటి ఆటంకాలు లేకుండా మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది

# బాపట్లలో 122 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల ఘన పంపిణీ

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేద కుటుంబాలకు ఎంతో గొప్పగా అండగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే తెలిపారు. బాపట్లలోని అధికారిక టీడీపీ కార్యాలయంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మొత్తం 122 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మంజూరైన రూ.




59,27,754 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన మంగళవారం స్వయంగా అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని అందుకున్న వారిలో కేవలం బాపట్ల మండలం మరియు పట్టణ ప్రాంతానికి చెందిన వారే కాకుండా, చుట్టుపక్కల ఉన్న పిట్టలవానిపాలెం అలాగే కర్లపాలెం మండలాల నుంచి వచ్చిన అనేక పేద కుటుంబాల లబ్ధిదారులు కూడా ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఆర్థిక సహాయాలు పార్టీలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి పూర్తిస్థాయిలో అందేలా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఆర్థిక సాయం అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నపూర్ణాదేవి అవతారంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**

పేరూరు: గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గణపతి పూజ, అభిషేకం, కుంకుమార్చన, హోమ కార్యక్రమాలను అర్చకులు రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం గ్రామ ప్రజలు, మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన ఉపాధ్యక్షులు కొండూరు శోభన్ బాబు, ధర్మపత్రి లక్ష్మీప్రసన్న, కార్తీక్, ముఖేష్ తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనకదుర్గమ్మ అనుగ్రహం పొందేందుకు గ్రామానికి చెందిన 17 మంది భక్తులు మాలధారణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పశువుల ప్రసాద్, బైరబోని శంకర్, గుండెగోని అంజయ్య, బుయ్య మధు, బైరు మహేందర్, మహి కోటయ్య, సందీప్, దారం లింగయ్య, కాళ్ల సైదులు, మణి, అశోక్, పవన్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ప్రభుత్వంలో అధికారులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారు: వైయస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**



తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో టీటీడీ మాజీ చైర్మన్, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం ఒక మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వంలో కొందరు అధికారులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరులోని ఒక పబ్‌లో తాగి ఓ ఐపీఎస్ అధికారి రచ్చ చేశారని, ఐపీఎస్ అధికారుల ఈ స్థాయి బరితెగింపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్న అలుసే ప్రధాన కారణమని ఆయన తీవ్రంగా

# చంద్రబాబు, జగన్‌తో తమిళనాడు సీఎం విజయ్ కీలక భేటీ: రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలపై చర్చ



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోసెఫ్ విజయ్ తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి సమస్యలు, ముఖ్యంగా చెన్నై నగరానికి కృష్ణా నీటి సరఫరా తదితర కీలక అంశాలపై ఇరు రాష్ట్రాల అధినేతల మధ్య చర్చ జరిగే అవకాశం ఉందని సమాచారం. చంద్రబాబుతో సమావేశం ముగిసిన తర్వాత ఆయన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కూడా కలవనున్నట్లు టీవీకే వర్గాలు వెల్లడించాయి. రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్న ఈ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# చిలకలూరిపేట రాజకీయాల్లో మరోసారి విడదల రజిని మార్క్: మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్సీపీ గెలుపే లక్ష్యంగా వ్యూహరచన

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**




చిలకలూరిపేట రాజకీయ రంగంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని మరోసారి తన రాజకీయ చతురతను, నాయకత్వ పటిమను చాటేందుకు సిద్ధమవుతున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయమే ప్రధాన లక్ష్యంగా చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

స్థానిక సంస్థల ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆమె, మున్సిపల్ పోరులో వైయస్సార్సీపీ పూర్తి విజయం సాధించడమే ధ్యేయంగా పక్కా వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన ప్రణాళికలపై ఆమె నాయకులతో చర్చిస్తూ ముందుకు వెళ్తున్నారు.

# ఆధారాలన్నీ ఎస్ఈసీకి ఇచ్చాం: మాజీ మంత్రి కురసాల కన్నబాబు




**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. రేపు ఉదయం నోటిఫికేషన్ రాబోతుంటే, నేడు వచ్చి అభ్యంతరాలు తెలపాలని అనడం చాలా విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. కుల ధృవపత్రాల జారీలో ఎదురవుతున్న సమస్యలు, అలాగే ఆన్‌లైన్ అనుమతుల ప్రక్రియపై ఈ సమావేశంలో వారు తమ అభ్యంతరాలను స్పష్టంగా వ్యక్తం చేశారు. తాము లేవనెత్తిన అంశాలకు సంబంధించిన అన్ని కీలక ఆధారాలను ఇప్పటికే ఎస్ఈసీకి సమర్పించామని ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు.

# క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు ఘనంగా శంకుస్థాపన

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**



అమరావతి క్వాంటమ్ వ్యాలీలో మరో అత్యంత కీలకమైన అడుగు పడింది. ఉద్దండరాయునిపాలెంలోని క్వాంటమ్ వ్యాలీ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన ప్రతిష్టాత్మక ట్విన్ టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు.

మొత్తం ముప్పై ఏడు లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల నలభై ఏడు చదరపు అడుగుల విశాలమైన విస్తీర్ణంలో టి-1, టి-2 టవర్ల నిర్మాణ పనులను భారీ ఎత్తున చేపట్టనున్నారు. అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయంగా ఎంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లయింది.

# ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు.. ఏడాదికి పన్నెండు వేల రూపాయల స్కాలర్‌షిప్



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కోసం దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోపు తమ పాఠశాలల హెడ్ మాస్టర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం డైరెక్టర్ స్పష్టం చేశారు.

ఈ స్కాలర్‌షిప్ అర్హత పరీక్ష వచ్చే నెల 29వ తేదీన నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు ప్రతి ఏటా రూ. 12,000 చొప్పున ఆర్థిక సహాయం (స్కాలర్‌షిప్) నేరుగా లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం, అక్టోబర్,14, 2026
www.trinetnews.com

# ఖైరతాబాద్ ఉప ఎన్నికపై జనసేనలో ఆసక్తికర చర్చ.. పవన్ సన్నిహిత పారిశ్రామికవేత్తకు అవకాశం దక్కేనా?

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక అంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఎన్నికలో జనసేన పార్టీ అనుసరించబోయే వ్యూహం, అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండే ఓ ప్రముఖ పారిశ్రామికవేత్తను ఖైరతాబాద్ బరిలోకి దింపే అవకాశం ఉందనే ప్రచారం ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ప్రచారంపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

**సొంతంగా పోటీ చేసే ఆలోచనలో జనసేన?**
తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జనసేన అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికను పార్టీకి ఒక అవకాశంగా మలుచుకోవాలనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి రాజకీయాలకు అతీతంగా సొంతంగా పోటీ చేయడం ద్వారా తెలంగాణలో జనసేనకు ఉన్న ప్రజాదరణను అంచనా వేసుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, పార్టీ నిజంగా స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్ణయించుకుందా? అన్నది స్పష్టత రావాల్సిన అంశమే.

**పవన్‌కు సన్నిహిత పారిశ్రామికవేత్తకు ఛాన్స్?**
ఖైరతాబాద్ అభ్యర్థిగా పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండే, జనసేనలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ పారిశ్రామికవేత్త పేరు తెరపైకి వస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. సాఫ్ట్‌వేర్, వ్యాపార రంగాల్లో అనుభవం ఉన్న వ్యక్తిని ఎన్నికల బరిలోకి దింపితే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందనే చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.
వ్యాపార రంగంలో సంపాదించిన అనుభవాన్ని ప్రజాసేవకు వినియోగించగల నాయకుడికి అవకాశం కల్పించడం ద్వారా అభివృద్ధి, ఉపాధి కల్పన, యువతకు అవకాశాలు వంటి అంశాలపై ప్రజల్లోకి వెళ్లవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే, సదరు పారిశ్రామికవేత్త ఎవరు? ఆయనకే టికెట్ ఖరారవుతుందా? అనే విషయాలపై ఇప్పటివరకు అధికారిక సమాచారం లేదు.

**తెలంగాణలో పార్టీ విస్తరణకు ఉప ఎన్నిక కీలకమా?**
ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా క్రియాశీలంగా ఉన్న జనసేన తెలంగాణలోనూ తన సంస్థాగత బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ చాలాకాలంగా సాగుతోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతను ఆకర్షించడం, వివిధ సామాజిక వర్గాలకు చేరువ కావడం వంటి అంశాలు ఈ క్రమంలో కీలకంగా మారనున్నాయి.
ఖైరతాబాద్ వంటి రాజకీయ ప్రాధాన్యం ఉన్న నియోజకవర్గంలో పోటీ చేయడం ద్వారా పార్టీకి ప్రజల్లో ఎంతమేర మద్దతు ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహం, స్థానిక నాయకత్వం సమన్వయం వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది.

**అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ**
ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జనసేన పోటీ చేస్తుందా? చేస్తే కూటమి భాగస్వామ్యాల సమన్వయంతో ముందుకెళుతుందా, లేక సొంతంగా బరిలోకి దిగుతుందా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు, పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న పారిశ్రామికవేత్తకు అవకాశం దక్కుతుందా? అన్న అంశం కూడా చర్చనీయాంశంగా మారింది.
అయితే, అభ్యర్థి ఎంపిక నుంచి పోటీ నిర్ణయం వరకు ఈ అంశాలన్నీ ప్రస్తుతం ప్రచారం, రాజకీయ అంచనాల స్థాయిలోనే ఉన్నాయి. జనసేన అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో పార్టీ తీసుకునే నిర్ణయం ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటు తెలంగాణలో జనసేన రాజకీయ భవిష్యత్తుపైనా ఆసక్తిని పెంచనుంది.

# చినిగిపోని.. తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు రాజ్ ఠాకూర్, విజయ రమణారరావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్డీ) కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



**15 అత్యాధునిక భద్రతా ఫీచర్లు**
కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.

**జీవితాంతం అవసరమయ్యే పత్రాలకు మరింత రక్షణ**
ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**2011 నుంచి మీ సేవ సెక్యూరిటీ పేపర్**
తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.

# కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ రాజీనామా ఊహాగానాలు ఊతం

**న్యూఢిల్లీ,ట్రైనెట్ న్యూస్ అక్టోబర్ 13:**
కేంద్ర మంత్రివర్గంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఊహాగానాల నడుమ కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తమిళనాడులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనను పూర్తిగా రాష్ట్ర రాజకీయాలకే పరిమితం చేయాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.



ప్రధాని మోదీకి తన రాజీనామా లేఖను సమర్పించిన ఎల్. మురుగన్.. కేంద్ర కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో పార్టీని క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా శక్తివంతం చేయడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాల నేపథ్యంలో తమిళనాడులో బీజేపీ జెండాను ఎగరవేయడానికి, పార్టీని గ్రామస్థాయిలో ప్రజలకు చేరువ చేయడానికి రాష్ట్ర బాధ్యతలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. తనకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేసే అవకాశం ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, జాతీయ నాయకత్వానికి మురుగన్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తాను సంతృప్తికరంగా పనిచేశానని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పదవికి వీడ్కోలు పలికిన ఎల్. మురుగన్ త్వరలోనే పూర్తిగా తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్లి పార్టీ బలోపేతం కోసం సుడిగాలి పర్యటనలు చేయనున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక.. ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా

**38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి.....**
**29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్**
**సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం**
**పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం**
**కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం**
**సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లు..**
**ప్రజాభవన్‌లో మీడియాతో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్.. ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం: మంత్రి శ్రీధర్‌బాబు**
**పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13 :**
సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది.సింగరేణిసంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ?ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.
సింగరేణి ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం"సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. ?
సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్ , అలవెన్స్ లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరపున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు.?
"సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమిత నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న వారి



ప్రాథమిక జాబితాను సిద్ధం చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను రూపొందిస్తాం. ఈ ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించాం. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతాం. సామాన్య కార్మికుడు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. అవసరమైతే వైద్యుల వేతనాలు, పారితోషికాలను పెంచి నిపుణులైన వైద్యులను నియమిస్తాం. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని" వెల్లడించారు.
బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్మికులతోపాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ)ను చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించారు. ?సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ఖరీదైన పట్టణ, వాణిజ్య భూములను సోలార్ ప్లాంట్లకు వినియోగించకుండా, పట్టణాలకు వెలుపల ఉన్న నిరుపయోగ భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను ఇందుకు ఉపయోగించుకోవాలని సూచించారు.
ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. వాటి నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.?
భూపాలపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సింగరేణి నుంచి స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించాలని, ఇందుకు బదులుగా రెవెన్యూ భూముల్లోని నిరుపయోగ గుట్టల భూములకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సత్తుపల్లి, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు. సింగరేణి సంస్థను అభివృద్ధి చేయడంతోపాటు కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, ఆరోగ్యం, గృహవసతి వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.సింగరేణి లాభాలు తగ్గడానికి కారణాలివే
గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సింగరేణి లాభాలు తగ్గడానికి పలు కారణాలున్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేయడం వల్ల సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సుమారు 141 బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోలేదని, దీంతో సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు. మరోవైపు ఇప్పటికే ఉన్న బొగ్గు బ్లాక్‌లలో కొన్ని మూతపడుతుండటంతో ఉత్పత్తి, ఆదాయంపై ప్రభావం పడుతోందన్నారు. దాదాపు 14 బ్లాక్‌లు మూతపడిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త బ్లాక్‌లను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.కొత్త బ్లాక్‌ల సాధనకు ప్రజా ప్రభుత్వం చర్యలుసింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త బ్లాక్‌లను సాధించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తాడిచెర్ల-2, కోయగూడెం బ్లాక్ -3, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి బ్లాక్‌లను ప్రస్తావిస్తూ, కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ఏ మైనింగ్ సంస్థ అయినా నిరంతరం కొత్త బ్లాక్‌లను సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటేనే దాని ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపు దృష్ట్యా ఈ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.?
మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరల సర్దుబాటు
?ప్రస్తుతం బొగ్గు మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మహానది, కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల నుంచి బొగ్గు సరఫరా అవుతోందని, ప్రైవేటు సంస్థలు కూడా తక్కువ ధరలకు బొగ్గును అందిస్తున్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి బొగ్గు ధరలను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.
విద్యుత్ సంస్థల బకాయిలపై స్పందన?సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా భట్టి విక్రమార్క ప్రస్తావించారు. గత పదేళ్లలో సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలు పేరుకుపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొత్తాలను క్రమంగా చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను ఒక్కసారిగా చెల్లించడం సాధ్యం కాకపోయినా, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. బకాయిలు ఎప్పుడు పేరుకుపోయినా, వాటిని చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు.
కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, మార్కెట్‌కు అనుగుణంగా ధరల సర్దుబాటు, బకాయిల వసూలు వంటి అంశాలపై సమగ్రంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి సంస్థను మరింత పటిష్ఠంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దసరా సందర్భంగా కార్మికులకు లాభాల వాటా, కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ప్రకటించడం వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.
సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్.. ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం: మంత్రి శ్రీధర్‌బాబు?
పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు??
సింగరేణి సంస్థను పదేళ్ల పాటు అధికారంలో ఉండి నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించలేని సమస్యలను ప్రతిపక్షంలో ఉండి ఎలా పరిష్కరిస్తారో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థకు చేసిన మేలేమిటో, కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయిందో ముందుగా పోరుబాటలో వివరించాలని శ్రీధర్‌బాబు సూచించారు. కార్మికుల సమస్యలపై ఇప్పుడు ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. మారుపేర్ల సమస్యను పదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు.?
కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం
సింగరేణి సంస్థను కాపాడటంతోపాటు కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. మారుపేర్ల సమస్య పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. డిస్మిస్డ్ ఉద్యోగుల సమస్యలతోపాటు కార్మికులకు సంబంధించిన పలు సంక్షేమ అంశాలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ?సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేం సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, విజయరామారావు, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, లాభాల వాటాను ప్రకటించడం పట్ల ఎమ్మెల్యేలు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను శాలువా కప్పి సత్కరించారు.

# అద్దె కార్లను తనఖా పెట్టి రూ.14.50 లక్షలు స్వాహా!



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వార్త లోకం న్యూస్ :**

అద్దెకు తీసుకున్న ఐదు కార్లను యజమానులకు తిరిగి ఇవ్వకుండా, ఇతరుల వద్ద తనఖా పెట్టి రూ.14.50 లక్షలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రావెల్స్ నిర్వాహకుడు వడ్డె మహేష్ (42)ను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. వాహన బదిలీ కోసం నకిలీ సంతకాలు, పత్రాలు ఉపయోగించినట్లు దర్యాప్తులో గుర్తించారు. నిందితుడి నుంచి ఐదు కార్లు, మొబైల్ ఫోన్, అసలు ఫారం-35ను స్వాధీనం చేసుకున్నారు. జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ కేసును ఛేదించారు.

# కీసర కల్యాణ మండపం దగ్గర అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు...





**కీసర డివిజన్ 1,మేడ్చల్ జిల్లా, వార్తలోకం న్యూస్. ఎస్. బాలకృష్ణ రెడ్డి :**

కీసరలో కల్యాణ మండపం దగ్గర శ్రీ దేవి నవరాత్రి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని అన్నపూర్ణదేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సాయికిరణ్ శర్మ(బబ్లు), సందీప్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం గ్రామ ప్రజలు,మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఇక్కడ సుమారు 100 నుండి 150 మంది మాలధారణ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు,పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మెట్‌పల్లి అర్టీసీ డిపో సిబ్బందికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం - జగిత్యాల డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

విపత్తుల ముప్పు తగ్గింపు అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు మరియు ఇతర సిబ్బందికి సీపీఆర్ (సిపిర్ ) పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేయడం నేర్చుకోవాలని, అత్యవసర వైద్య పరిస్థితుల్లో ముఖ్యంగా గుండె ఆగిపోయినప్పుడు సకాలంలో సీపీఆర్ చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ చేయడం బాధితుల ప్రాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సీపీఆర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో కూడా సీపీఆర్ అవగాహన శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే నైపుణ్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని వివరించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి పూదరి నరేందర్ గౌడ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు కందుకూరి కృష్ణారెడ్డి, చిట్ల రాజ మనోహర్ రెడ్డి, మచ్చ నారాయణ, తుమ్మనపల్లి సత్యనారాయణ, చిత్తారి మధుకర్, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ హరి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సరస్వతి దేవిగా వీణపాటతో ఆకట్టుకున్న చిన్నారి వైష్ణవి...





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

వీణ పాటకు నాట్యం చేస్తూ... సరస్వతి దేవి వేషధారణలో ఈ చిన్నారి భక్తులను అమితంగా ఆకట్టుకుంది. గుడ్లవల్లేరుకు చెందిన 4వ తరగతి చదువుతున్న నంగెడ్డ వైష్ణవి తన నృత్యంతో కైకలూరు శ్యామలాంబ అమ్మవారి సన్నిధిలో దసరా నవరాత్రులలో భక్తులనుఅలరించిందని వైష్ణవి తల్లిదండ్రులు, గుడ్లవల్లేరు వైష్ణవి కర్రీ పాయింట్ అండ్ క్యాటరింగ్ నిర్వాకులు నంగెడ్డ నారాయణ, వరలక్ష్మి మంగళవారం విలేకరులకు తెలిపారు. తమ కుమార్తె నాట్యానికి ముగ్ధులైన దేవస్థానం వారు బహుమతులను అందించారని నారాయణ, వరలక్ష్మి దంపతులు పేర్కొన్నారు.

# బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా తగిలి పరశురాములు ఎన్నిక



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

తెలకపల్లి మండల పరిధిలోని గట్టు రాయిపాకుల గ్రామానికి చెందిన పరశురాములు బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఓ బి సి యువ మోర్చా మండలాధ్యక్షులుగా సూర్య భాస్కర్ గౌడ్, సూర్య మధుసూదన్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా గుర్రం ఆంజనేయులు రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షులుగా కౌకుంట్ల అనిత, మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా మహమ్మద్ ఖాదర్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు వారికి హార్దిక అభినందనలు తెలిపారు.

# దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు చేతుల మీదుగా వరుణ్ సందేశ్, శ్వేతా బసుప్రసాద్ ఆహా ఒరిజినల్ "నా వైఫ్ మిస్సింగ్" నుంచి 'అరెరే వినవా..' సాంగ్ రిలీజ్ఈ నెల 22న ప్రీమియర్ కు వస్తున్న "నా వైఫ్ మిస్సింగ్" వెబ్ సిరీస్





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్ తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎగ్జైటింగ్ సిరీస్ ను మన ముందుకు తీసుకొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ "నా వైఫ్ మిస్సింగ్" ఈ నెల 22వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది. "నా వైఫ్ మిస్సింగ్" సిరీస్ ను లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్ పై శివ కంఠంనేని నిర్మించారు. స్వాతిప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహించారు. ఈ రోజు దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు చేతుల మీదుగా "నా వైఫ్ మిస్సింగ్" నుంచి 'అరెరే వినవా..' సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ – నా వైఫ్ మిస్సింగ్ అనే టైటిల్ తోనే ఈ సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది. అరెరే వినవా పాట చాలా బాగుంది. సాయి కార్తీక్ ఈ పాటను ఆకట్టుకునేలా కంపోజ్ చేశారు. స్వాతి ఈ చిత్రంతో డైరెక్టర్ గా పరిచయమవుతోంది. ప్రొడ్యూసర్ శివకంఠంనేని ఆయన స్నేహితులు అందరికీ ఈ సినిమా పెద్ద విజయం అందివ్వాలని కోరుకుంటున్నా. అలాగే ఆహా కూడా ఇలాంటి మంచి కంటెంట్ ఉన్న మూవీస్ ను ఎంకరేజ్ చేయాలి. అన్నారు.ఈ పాటకు సాయి కార్తీక్ బ్యూటిఫుల్ ట్యూన్ కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి అంతే అందంగా పాడారు. శ్రీ సాయి కిరణ్ క్యాచీ లిరిక్స్ అందించారు. 'అరెరే వినవా..' ఎలా ఉందో చూస్తే – 'అరెరే వినవా కదిలే కలవా ఏ పేరుతో నిన్ను పిలవాలమ్మా, జరిగే కథవా ఎదురే పడవా ఏ చోట నిన్ను వెతకాలమ్మా, నేనంటే నేను లేనంటే లేను తొలిసారి నిన్ను చూడంగానే, నా ఊహల్లోను నా ఆశల్లోను అందంగా దాచుకుంటున్నానే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుంది పాట.

నటీనటులు – వరుణ్ సందేశ్, శ్వేతా బసుప్రసాద్, ప్రవీణ్, సత్య శ్రీ, తదితరులు

టెక్నీషియన్స్

---

ఎడిటర్ – సాయిబాబు తలారి
డీవోపీ – ఎన్.ఎస్. సతీష్ కుమార్
మ్యూజిక్ – సాయి కార్తీక్
స్టోరీ – ఉమర్జీ అనురాధ
క్రియేటెడ్ బై – శ్రీనివాస్ మండల
బ్యానర్ – లైట్ హౌస్ సినీ మ్యాజిక్
ప్రొడ్యూసర్ – శివ కంఠంనేని
డైరెక్టర్ – స్వాతిప్రకాష్ మంత్రిప్రగడ
పీఆర్ఓ – సురేష్ (ఎస్ కే మీడియా)

# తప్పిపోయిన ఆవు.. దూడతో సహా యజమానికి అప్పగింత సోషల్ మీడియా ద్వారా ఆచూకీ గుర్తింపు.. తుడుం శ్రీనివాస్ చొరవకు అభినందనలు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

కీసర లో తప్పిపోయిన ఆవు ఆచూకీని సోషల్ మీడియా ద్వారా గుర్తించి, దూడతో సహా యజమానికి సురక్షితంగా అప్పగించడంలో కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు.

కీసర ఎగ్జిట్ నంబర్8 రింగ్ రోడ్ పరిసరాల్లో తప్పిపోయిన ఆవును అక్కడి సిబ్బంది సుమారు ఎనిమిది గంటలపాటు సంరక్షించారు. ఈ క్రమంలో ఆవు దూడకుజన్మనివ్వడంతో రెండింటినీ జాగ్రత్తగా చూసుకున్నారు. విషయం తెలుసుకున్న తుడుం శ్రీనివాస్ ఆవు ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయగా, యజమాని జహంగీర్ స్పందించారు. అనంతరం కీసర పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, యజమాని సమర్పించిన పత్రాలు, ఆధారాలను పరిశీలించి ఆవును జహంగీర్‌కు చెందినదిగా నిర్ధారించారు. దీంతో ఆవును, దూడను సురక్షితంగా యజమానికి అప్పగించారు. తన ఆవు తిరిగి దొరకడంతో జహంగీర్ సంతోషం వ్యక్తం చేస్తూ తుడుం శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. మూగజీవాల పట్ల ప్రేమ.. సమాజ సేవలో బాధ్యత సోషల్ మీడియాను ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తూ, ప్రజలకు అండగా నిలుస్తున్న తుడుం శ్రీనివాస్ సేవలను పలువురు అభినందించారు. ఆవును, దూడను సంరక్షించిన రింగ్ రోడ్ సిబ్బందికి, సహకరించిన కీసర పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రాయికల్ శివారు సర్వే నెం.1075 భూమి మోసం - పహానీ 2005-06 లో 2.5 గుంటలు మాత్రమే ఉంటే 9 గుంటలు ఎలా అయింది?

**-ప్రశ్నించిన సీనియర్ సిటిజన్ కలగిరి అనసూర్య గంగ రెడ్డి (72)**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం కలగిరి అనసూర్య, భర్త గంగారెడ్డి, ఇంటి నెం.27-7/7 జగిత్యాల రోడ్, రాయికల్ -భూమి 468.18 చ.గజాలు, సర్వే నెం.1075, రాయికల్ శివారులో డాక్యుమెంట్ నెం.1666/2019 గిఫ్ట్ డీడ్ ద్వారా నా భర్త కలగిరి గంగారెడ్డి నుండి వచ్చింది. పొజిషన్ నా దగ్గరే ఉంది. నా పక్కన పల్లికొండ భీమయ్య తండ్రి గంగయ్య – ఒక చేయి లేని వికలాంగుడు పేదవాడు. ఆయనకు భూమి ఉంది. మా ఇద్దరి మధ్య ఎలాంటి గొడవ లేదు.

కానీ కటకం రాజేశం మరియు దొడ్డ వసంత రెడ్డి – పహానీ 2005-2006 లో కేవలం 2.5 గుంట మాత్రమే ఉన్న దానిని 9.00 గుంటగా చెప్పి, రౌరా లేకుండా అక్రమంగా క్లెయిమ్ చేస్తున్నారు ప్రతి ప్రజావాణిలో విజ్ఞప్తి చేయడం చర్యలు తీసుకోకపోవడం ఏశీతవరకు సమంజసమని కాలగిరి గంగిరెడ్డి ఆవేదనా వ్యక్తం చేసారు పహానీ 2005-06 ప్రకారం 2.5 గుంట మాత్రమే. 9 గుంట కాదు.

ఆర్డీఓ ఆఫీస్ జగిత్యాల కంప్యూటర్ ఆపరేటర్ అదేపు అంతోష్ – బయాస్డ్ రిపోర్ట్ నెం.129/2026 తేదీ 01-04-2026 ఇచ్చారు.

నేను ఎంఆర్ఓ రాయికల్ కు 10-10-2026 న పోస్టల్ ఆర్డర్ నెం.62ఖీ 061823 రూ.10/- తో కంప్లైంట్ ఇచ్చాను. ఇవ్వాళ 12-10-2026 ప్రజావాణి కార్యక్రమం, ఆర్డీఓ ఆఫీస్ జగిత్యాల డివిజన్ లో గ్రీవెన్స్ ఐడి DJGTL12102600004 ద్వారా మళ్ళీ కంప్లైంట్ ఇచ్చాను. ఫోటో ప్రూఫ్ ఉంది.

కటకం రాజేశం, దొడ్డ వసంత రెడ్డి 7 రోజుల్లో రౌరా చూపించాలి.

పహానీ 2005-06 ప్రకారం 2.5 గుంట మాత్రమే – 9 గుంట కాదు అని జాయింట్ సర్వే చేయాలి.నా 468.18 చ.గజాలు మరియు పేదవాడు పల్లికొండ భీమయ్య భూమికి రక్షణ కల్పించాలి. అదేపు అంతోష్ – ఆర్డీఓ కంప్యూటర్ ఆపరేటర్ మీద చర్య తీసుకోవాలి. అని కలగిరి అనసూర్య గంగారెడ్డి అంటున్నరు

# శ్రీ కొండలమ్మకు సామూహిక కుంకుమార్చనలు, హోమాలు...

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**





మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో అమ్మవారికి శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవముల్లో భాగంగా మంగళవారం విశేషాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, హోమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు(మోహన్), టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు దంపతులు, ఏఈఓ ఆకుల కొండలరావు దంపతులు, ధర్మకర్తలు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మీ పావని, ఎక్స్ అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మచే శ్రీ అమ్మవారి దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. సహస్రనామ కుంకుమార్చన, శ్రీ గాయత్రీ మూల మంత్రహవనములను చేపట్టారు. అనంతరం భక్తులు అందరికి దేవస్థానము సిబ్బంది ప్రసాదములు అందజేశారు.

# దేశంలోఅన్ని ఆస్పత్రుల్లో ట్రీట్మెంట్ ధరలను ఇక పై డిస్ ప్లే చేయాలి: కేంద్రం..

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**

దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ అన్ని ఆస్పత్రుల్లో అందించే చికిత్సల ధరలను ప్రదర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించిందిఈ మేరకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది ప్రతి చికిత్సకు సంబంధించిన రేట్లను ఇంగ్లిష్ తో పాటు స్థానిక భాషలోనూ ప్రదర్శించాలని పేర్కొంది ఈ నిబంధన అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. ఆస్పత్రి బిల్లుల విషయంలో తలెత్తే వివాదాలు, ఫిర్యాదులను తగ్గించడమే ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్రం తెలిపింది.



## విమాన ప్రయాణంలో పోస్టుకార్డుల పలకరింపు

## ఇండియా పోస్ట్, ఇండిగో సంయుక్తంగా 'డిజిటల్ డీటాక్స్' కార్యక్రమం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** డిజిటల్ ప్రపంచంలో చేతిరాత లేఖల ఆనందాన్ని మళ్లీ పరిచయం చేసేందుకు ఇండియా పోస్ట్, ఇండిగో విమానయాన సంస్థ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించాయి. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 12న తపాలా బిళ్లల సేకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'డిజిటల్ డీటాక్స్' కార్యక్రమాన్ని చేపట్టాయి. సుమారు 30 వేల అడుగుల ఎత్తులో విమాన ప్రయాణం చేస్తున్న ప్రయాణికులను డిజిటల్ పరికరాలకు కొంత విరామమిచ్చి, తమ ఆలోచనలను పోస్టుకార్డులపై రాసేందుకు ప్రోత్సహించారు. ఆత్మీయులకు చేతిరాత సందేశాలు రాయడం ద్వారా అనుబంధాలను బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలోని తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని ఇండిగో సహకారంతో నిర్వహించింది.

తెరలతో గడిపే సమయానికి విరామమిస్తూ, మనసులోని భావాలను కాగితంపై వ్యక్తీకరించే అవకాశాన్ని ప్రయాణికులకు కల్పించారు. చేతిరాత లేఖల ప్రత్యేకతను గుర్తుచేస్తూ, మానవ సంబంధాల్లో ఆత్మీయతను పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. జాతీయ తపాలా వారోత్సవాలు అక్టోబర్ 9 నుంచి 15 వరకు కొనసాగుతున్నాయి.




## భారత్--చెక్ రక్షణ పారిశ్రామిక సహకారం విస్తరణ

## రాజ్‌నాథ్ సింగ్‌తో చెక్ ఉప ప్రధాని కారెల్ హావ్లిచెక్ భేటీ

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** భారత్, చెక్ రిపబ్లిక్ మధ్య రక్షణ పారిశ్రామిక సహకారాన్ని మరింత విస్తరించాలని ఇరు దేశాలు అంగీకరించాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం న్యూఢిల్లీలో చెక్ రిపబ్లిక్ మొదటి ఉప ప్రధాని, పరిశ్రమలు--వాణిజ్య శాఖ మంత్రి కారెల్ హావ్లిచెక్‌తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య రక్షణ పారిశ్రామిక సహకారానికి సంబంధించిన వివిధ అంశాలను సమీక్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న భాగస్వామ్యాలు, విజయవంతంగా ఏర్పాటైన పలు సంయుక్త సంస్థలపై ఇరువురు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలను ప్రోత్సహించేలా భారత్--చెక్ సంయుక్త రక్షణ కమిటీ ఆధ్వర్యంలోనూ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.



## సముద్ర నాచు సాగుతో తీరప్రాంతాలకు ఉపాధి

## సాంకేతికత, విలువ జోడింపుపై దృష్టి పెట్టాలి: కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** సముద్ర నాచు సాగును విస్తరించి తీరప్రాంత ప్రజలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలక్ష్ లిఖి సూచించారు. తమిళనాడులోని మండపం క్యాంప్ పరిధిలో ఉన్న మున్నైకాడు సముద్ర నాచు సాగు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన సాగుదారులతో మాట్లాడి, సాగు పద్ధతులు, నిర్వహణ, పంటసేకరణప్రక్రియలను పరిశీలించారు. దేశంలో సముద్ర నాచు సాగును ప్రోత్సహించడం, తీరప్రాంతజీవనోపాధులను బలోపేతం చేయడం, ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు విలువ గొలుసును అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ పర్యటనచేపట్టారు. సాంకేతికతవినియోగం, ఉత్పత్తులకు విలువ జోడించడం, స్థిరమైన ఉపాధి అవకాశాల కల్పనపై లిఖి దృష్టి సారించారు. తమిళనాడులో అనుసరిస్తున్న మోనోలైన్ పద్ధతి, తెప్పల ఆధారిత సాగు విధానాలను రైతులు వివరించారు. సాగు, నిర్వహణ, పంట కోత పనులను ప్రదర్శించారు. సముద్ర నాచు సాగు ద్వారా సుస్థిర ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాల కృషిని కార్యదర్శి అభినందించారు.

ఉత్పత్తిని పెంచడంతోపాటు మరింత మంది రైతులను సంఘటిత సాగులో భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలని కోరారు. పర్యటనకు ఒకరోజు ముందు మండపంలోనిఐసీఏఆర్--కేంద్ర సముద్ర మత్స్య పరిశోధనా సంస్థ ప్రాంతీయ కేంద్రంలో సముద్ర నాచు సాగుపై నిర్వహించిన సమావేశానికి లిఖి అధ్యక్షత వహించారు. సాగుకార్యక్రమాల పురోగతిని సమీక్షించి, ఉత్పత్తి విస్తరణ, విలువ జోడింపు, మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేసే చర్యలపై చర్చించారు.

## రంగుల వ్యర్థ జలాల శుద్ధికి పర్యావరణహిత సాంకేతికత

## మెషిన్ లెర్నింగ్ సాయంతో పనిచేసే నానోఫైబర్ ఫిల్టర్ అభివృద్ధి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** పరిశ్రమల నుంచి వెలువడే రంగులతో కలుషితమైనవ్యర్థజలాలనుశుద్ధిచేసేందుకు మొహాలీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఎన్ఎస్‌టీ) పరిశోధకులుపర్యావరణహితసాంకేతికతను అభివృద్ధి చేశారు. సహజ వనరులతో తయారుచేసినజింక్‌ఆక్సైడ్ నానోకణాలను, జీవవిఘటనకు అనుకూలమైన పాలీలాక్టిక్ యాసిడ్ (పీఎల్ఏ) నానోఫైబర్లతో అనుసంధానించి బహుళ ప్రయోజన ఫిల్టర్‌ను రూపొందించారు. దీనికి మెషిన్ లెర్నింగ్‌సాంకేతికతనుతోడుగావినియోగించారు. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమల నుంచి విడుదలయ్యే కొన్ని సేంద్రీయ రంగులు విషపూరితంగా ఉండటంతోపాటు సహజంగా విచ్ఛిన్నం కావడానికి ఎక్కువ సమయంపడుతుంది. ఇవి పర్యావరణానికి సవాలుగా మారుతున్న నేపథ్యంలో సుస్థిర శుద్ధి విధానాల అవసరాన్ని ఈ పరిశోధన దృష్టిలో పెట్టుకుంది. ప్రస్తుతంఉపయోగిస్తున్న అధిశోషణం, అవక్షేపణం, మలినాలను గుంపులుగా చేసి వేరుచేసే పద్ధతులు కాలుష్య పదార్థాలను నీటి నుంచి తొలగించగలిగినా, వాటిని పూర్తిగా విచ్ఛిన్నం చేయకపోవచ్చు. అధిక స్థిరత్వం కలిగిన రంగుల విషయంలో జీవశుద్ధి ప్రక్రియ కూడా నెమ్మదిగా సాగుతుంది. కాంతి శక్తితో కాలుష్య పదార్థాలను విచ్ఛిన్నం చేసే 'ఫొటోక్యాటలిసిస్' దీనికి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. అయితే సంప్రదాయ ఫొటోక్యాటలిటిక్ విధానాల్లోనానోకణాలనుతిరిగిసేకరించడం, శుద్ధి చేసిన నీటి నుంచి వేరుచేయడం, తగినంత కాంతి అందుబాటులో ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి. వీటిని అధిగమించేందుకుపరిశోధకులు రంధ్రాలతోకూడిన పీఎల్ఏ నానోఫైబర్లలో జింక్ ఆక్సైడ్ కణాలను స్థిరపరిచి, కాంతితోపాటు యాంత్రిక ప్రకంపనలను వినియోగించారు.

ఈ ప్రకంపనల వల్ల ఏర్పడే పైజోఎలక్ట్రిక్ ప్రభావం, కాంతి ద్వారా ఉత్పన్నమయ్యే ఎలక్ట్రాన్లు--హోల్స్ తిరిగి కలిసిపోవడాన్ని తగ్గిస్తుంది. తద్వారా కాలుష్య పదార్థాలను విచ్ఛిన్నంచేయడంలోసహాయపడేక్రియాశీల పదార్థాల ఉత్పత్తి పెరుగుతుంది.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ అయిన ఐఎన్ఎస్‌టీ చేపట్టిన ఈ పరిశోధన వివరాలు'అడ్వాన్స్‌డ్‌ఫంక్షన్ మెటీరియల్స్' జర్నల్‌లోప్రచురితమయ్యాయి. రంగులతో కలుషితమైన వ్యర్థ జలాల శుద్ధికి ఈ సాంకేతికత పర్యావరణహిత మార్గాన్ని అందించే అవకాశముంది.

## ప్రధాని జ్ఞాపికల వేలంలో ఉత్తరాఖండ్ ఆధ్యాత్మిక వైభవం

## 27 జ్ఞాపికల్లో పుణ్యక్షేత్రాలు, జానపద కళలు.. ఆదాయం నమామి గంగేకు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం ప్రధాని జ్ఞాపికల ఎనిమిదో విడత ఈ--వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రధానమంత్రికి బహుమతులుగా అందించిన వస్తువుల్లో ఉత్తరాఖండ్‌కు సంబంధించిన 27 జ్ఞాపికలు ఈ వేలంలో ఉన్నాయి. చిత్రాలు, ఛాయాచిత్రాలు, ఆలయ నమూనాలు, ఇతర స్మారక వస్తువులు రాష్ట్రంలోని విశ్వాసాలు, కళలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబిస్తున్నాయి. వేలం ద్వారా సమకూరే ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి వినియోగించనున్నారు.

ఈ సేకరణలో నాలుగు ఆలయ నమూనాలు ఉన్నాయి. శ్రీ కేదార్‌నాథ్ ధామ్‌కు చెందిన రెండు నమూనాలు, ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర్ ఆలయ నమూనా, ముఖ్బాలోని గంగాజీ మందిర్ చెక్క నమూనా ఉత్తరాఖండ్ పుణ్యక్షేత్రాల ప్రాధాన్యాన్ని చాటుతున్నాయి.



బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రితో కూడిన చార్‌ధామ్ ఛాయాచిత్రం కూడా వేలంలో ఉంది. హరిద్వార్‌లోని మానసాదేవి చిత్రం, ఆది కైలాస పర్వత దృశ్యం, మహాసూ దేవత ఆలయ ప్రతిరూపం, ఎల్ఈడీ వెలుగులతో కూడిన కార్తిక్ స్వామి ఆలయ గాజు జ్ఞాపిక ఈ సేకరణకు మరింత ప్రత్యేకతను చేకూరుస్తున్నాయి. నారాయణ ఆశ్రమం, కుమావ్ హిమాలయాల దృశ్యాలతో కూడిన చిత్రం అక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది.

ఉత్తరాఖండ్ సంప్రదాయ 'ఐపన్' కళతో రూపొందించిన గోడ గడియారం, దుర్గామాత కళాచిత్రం స్థానిక కళల్లో భక్తి భావానికి ఉన్న స్థానాన్ని తెలియజేస్తున్నాయి. ఏడు ఉత్తరాఖండీ, పహాడీ టోపీలు రాష్ట్ర ప్రాంతీయ గుర్తింపునకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

ఉత్తరాఖండ్‌కు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లక్ష్యసేన్ సంతకం చేసిన రాకెట్ కూడా ఈ వేలంలో ఉంది. ప్రధానంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలతో కూడిన ఈ సేకరణలో అది రాష్ట్ర క్రీడా విజయాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

ముఖ్బాలోని గంగాజీ మందిర్ నమూనా ఉత్తరాఖండ్ ఆధ్యాత్మిక జీవనంలో గంగానదికి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తోంది. ఈ జ్ఞాపికల వేలం ద్వారా వచ్చే ఆదాయం నమామి గంగే కింద గంగానది పునరుజ్జీవనం, పరిరక్షణకు తోడ్పడనుంది.

## నౌకాదళంలోకి స్వదేశీ బహుళ ప్రయోజన నౌక 'సమర్థక్'

## అక్టోబర్ 16న కార్వార్‌లో ప్రవేశపెట్టనున్న భారత నౌకాదళం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన బహుళ ప్రయోజన యుద్ధనౌక 'సమర్థక్'ను భారత నౌకాదళం అక్టోబర్ 16న కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరంలో అధికారికంగా సేవల్లోకి ప్రవేశపెట్టనుంది. కేంద్ర ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా లార్సెన్ అండ్ టూబ్రో సంస్థ నిర్మించిన ఈ నౌక, నౌకాదళంలో చేరనున్న నాలుగు బహుళ ప్రయోజన నౌకల్లో మొదటిది.

రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా 'సమర్థక్' ప్రవేశం మరో కీలక మైలురాయిగా నిలవనుంది. వ్యూహాత్మకంగా ప్రాధాన్యమున్న కార్యకలాపాల్లో వివిధ అవసరాలకు ఉపయోగపడే నౌకగా ఇది సేవలందించనుంది.



ప్రధానంగా సముద్ర నిఘా, గస్తీ కోసం రూపొందించిన 'సమర్థక్' తక్కువ తీవ్రత గల సముద్రకార్యకలాపాలనుకూడానిర్వహించగలదు. లక్ష్యాల మోహరింపు, పరీక్షలకు వేదికగా, మానవరహిత, స్వయంచాలిత వ్యవస్థలకు మాతృనౌకగా పనిచేసే సామర్థ్యం దీనికి ఉంది. మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లోనూ ఈ నౌకను వినియోగించవచ్చు. అవసరమైనప్పుడు పరిమిత వైద్య సేవలందించే ఆసుపత్రి నౌకగా మార్చుకునే సౌలభ్యం ఉంది. సముద్రంలో ప్రమాదానికి గురైన నౌకల రక్షణ, వెలికితీత కార్యకలాపాలకు కూడా తోడ్పడనుంది. సవాళ్లతో కూడిన సముద్ర వాతావరణంలో కార్యకలాపాలు నిర్వహించేందుకు అనువుగా స్వదేశీ సెన్సర్లు, ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలను సమగ్ర పోరాట వ్యవస్థలో అనుసంధానించారు. 'సమర్థక్' చిహ్నంలో అలల నుంచి బయటకు వస్తున్న భారతీయ ఏనుగును చిత్రించారు. ఇది నౌక బలం, తెలివితేటలు, చురుకుదనానికి ప్రతీకగా నిలుస్తోంది.

## ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు మరిన్ని చర్యలు

## 150 విద్యుత్ బస్సులు ప్రారంభం.. కొత్తగా 13 గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** దేశ రాజధానిలో వాయు కాలుష్య నియంత్రణ చర్యలను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా మంగళవారం క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అధిక కాలుష్యం నమోదయ్యే ఆనంద్ విహార్ ప్రాంతంలో ఢిల్లీ ప్రభుత్వం చేపడుతున్న నివారణ చర్యలను పరిశీలించారు. అనంతరం శాస్త్రి పార్క్‌లోని ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ (డీపీసీసీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న కృత్రిమ మేధ ఆధారిత సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆనంద్ విహార్‌లోని స్వామి వివేకానంద అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ వద్ద 150 కొత్త విద్యుత్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఆనంద్ విహార్



ఐఎస్‌బీటీ, నంద్ నగ్రి డిపో, రోహిణి సెక్టార్--37 డిపో, నాంగ్లోయ్, కేశోపూర్ డిపోల్లో ప్రజల వినియోగానికి ఏర్పాటు చేసిన విద్యుత్ వాహన ఛార్జింగ్‌కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఢిల్లీ వ్యాప్తంగా డీపీసీసీ ఏర్పాటు చేసిన 13 కొత్త నిరంతర పరిసర గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలనుకూడ ప్రారంభించారు.

ఈ కేంద్రాలను సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించడం ద్వారా గాలినాణ్యతపర్యవేక్షణనుమరింతమెరుగుపరచనున్నారు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, ఆనంద్ విహార్‌లో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడం, గాలి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థను విస్తరించడంపై ఢిల్లీ ప్రభుత్వాన్నిభూపేందర్‌యాదవ్‌అభినందించారు. కార్యక్రమంలో ఢిల్లీ పర్యావరణ, అటవీ, వన్యప్రాణి శాఖ మంత్రి మన్‌జిందర్ సింగ్ సిర్సా, రవాణా శాఖ మంత్రి డాక్టర్ పంకజ్ కుమార్ సింగ్, తూర్పు ఢిల్లీ ఎంపీ, కేంద్ర రోడ్డు రవాణా--రహదారుల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాతోపాటు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ కొత్త వెబ్‌సైట్ ప్రారంభం

## ప్రజలకు సులభంగా, పారదర్శకంగా సేవలు: కేంద్ర మంత్రి లలన్ సింగ్

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:** డిజిటల్ పాలనను బలోపేతం చేస్తూ కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ (డీఏహెచ్‌డీ) పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ మంగళవారంప్రారంభించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ రూపొందించిన డిజిటల్ బ్రాండ్ ఐడెంటిటీ మాన్యువల్ (డీబీఐఎం) వెర్షన్ 3.0 ప్రమాణాలకు అనుగుణంగా ఈ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింతసులభంగా, పారదర్శకంగాఅందించేందుకు ఈ వెబ్‌సైట్ కీలక ముందడుగని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 'డిజిటల్ ఇండియా', 'కనిష్ఠ ప్రభుత్వం--గరిష్ఠ పాలన' దృక్పథానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని



చేపట్టినట్లు తెలిపారు. వెబ్‌సైట్ రూపకల్పనలో కృషి చేసిన శాఖ ఐటీ బృందం, జాతీయ సమాచారకేంద్రం (ఎన్ఐసీ)ను అభినందించారు. పశువుల ఆరోగ్యం, పశుసంవర్ధక పథకాలు, పాడి పరిశ్రమ అభివృద్ధి, పశు నిర్వహణతోపాటు శాఖ కార్యక్రమాలు, సేవల సమాచారాన్ని తెలుసుకునేందుకు కొత్త వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సంబంధిత వర్గాలకు మంత్రిసూచించారు.

వినియోగదారులు సమాచారాన్ని సులభంగా వెతికేందుకు అధునాతన శోధన సదుపాయం కల్పించారు. 'భాషిణి' ద్వారా బహుభాషా సేవలు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విభాగాలను చేరుకునే సౌలభ్యం, కేంద్రీకృత సమాచార నిర్వహణ వంటి ప్రత్యేకతలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పశుసంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, రాష్ట్రీయ గోకుల్ మిషన్, జాతీయ పశుసంపద మిషన్, పశువులఆరోగ్యం-వ్యాధినియంత్రణకార్యక్రమం తదితర ప్రధాన పథకాల సమాచారాన్ని ఒకేచోట పొందేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు. పథకాల వివరాలు, మార్గదర్శకాలు, సంబంధిత వనరులు, డిజిటల్ వేదికలను సులభంగా చేరుకునేందుకు ఇది ఉపయోగపడనుంది.

## రేపు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం..

## - ప్రజలు సద్వినియం చేసుకోవాలి : కవిత పృథ్వీరాజ్, అడపా చంద్రమౌళి



**హైదరాబాద్ అక్టోబర్13 (ట్రైనెట్ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగం గా ఈ నెల 15వ తేదీన ఉచిత వై ద్య శిబిరం, రక్తదాన శిబిరం ని ర్వహించనున్నారు. నలువాల కవిత పృథ్వీరాజ్, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకర హాస్పిటల్స్ సేవా భారతి నేతృత్వంలో ఈనెల 15వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంబర్ పేట శివంరోడ్డులోని ఏటిఐ క్యాంపస్ లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంగళవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. నగ రంలోని నీరు పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే శిబిరం లక్ష్యమన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా వైద్య సేవలకు దూరమవుతున్న నిరుపేదలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపా రు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్ వివిధ వైద్య పరీక్షలు, నిపుణుల సలహా లు, అవసర మైన చికిత్స, మం దుల పంపిణీ వంటి సేవలను ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. ఈ మెగా వైద్య శిబిరం కార్యక్రమానికి కేంద్రమం త్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతమ్ రావు పలువురు బిజెపి నాయకులు హాజరవనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకుని ఉ చిత వైద్య సేవలు పొందాలని, అలాగే ఈ కార్యక్ర మంలో భారతీయ జనతా పార్టీ నాయకు లు, కార్యకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



# రాధా రాణి బృందం మధుర గీతాల మాల



**హైదారాబాద్ , ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 13:**
ప్రఖ్యాత సినీ గీత రచయిత డాక్టర్ సి నారాయణ రెడ్డి రచించిన ఎన్నో గీతాలను రాధా రాణి సహా గాయనీ గాయకులతో కలిసి పాడి శ్రీతల ను పులకితుల చేశారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై రాధా రాణి ఆర్ట్స్ అండ్ మ్యూజికల్స్ నిర్వహణలో వరాల తెలుగు ఒకటేనన్న శీర్షికన సినారె మధుర సినీ గీతాల మాల గా జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ రాధా రాణి గళం లో మాధుర్యం ఉందని ఆమె సుశీల జానకి లీల వంటి నేపథ్య గాయనీ మణులు స్వరం బాగా అనుకరించగలదు అని అభినందించారు ప్రముఖ గాయకుడు త్రినాథ రావు శుభాకాంక్షలు తెలిపారు

# అన్నపూర్ణాదేవి అవతారంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**
పేరూరు: గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గణపతి పూజ, అభిషేకం, కుంకుమార్చన, హోమ కార్యక్రమాలను అర్చకులు రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం గ్రామ ప్రజలు, మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన ఉపాధ్యక్షులు కొండూరు శోభన్ బాబు, ధర్మపత్రి లక్ష్మీప్రసన్న, కార్తీక్, ముఖేష్ తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కనకదుర్గమ్మ అనుగ్రహం పొందేందుకు గ్రామానికి చెందిన 17 మంది భక్తులు మాలధారణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పశువుల ప్రసాద్, బైరబోని శంకర్, గుండెగోని అంజయ్య, బుయ్య మధు, బైరు మహేందర్, మహి కోటయ్య, సందీప్, దారం లింగయ్య, కాళ్ల సైదులు, మణి, అశోక్, పవన్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# రాయికల్ మండలంలో అన్నపూర్ణా దేవి స్వరూపం లో పూజలు.శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపెల్లి, చింతలూరు ఒడ్డెలింగాపూర్ తదితర గ్రామాల్లో నెలకొల్పిన దుర్గా దేవి మండపాల్లో మంగళవారంఅందరికీ ఆహారపదార్థాలు అందించే తల్లి అన్నపూర్ణా దేవి స్వరూపంగా దుర్గామాత ప్రత్యేక పూజలు పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ పూజా కార్యక్రమాల మధ్య వైభవంగా నిర్వహించారు.ఎలోనినో ప్రభావం తో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులు దేవి కృపతో తొలగిపోయి సుఖసంతోషాలు చేకూరాలని భక్తులు ఆకాంక్షించారు.ఆయా గ్రామాల్లో విగ్రహాదాతలు తమ వంతు సహకారం అందించారు.ఈ కార్యక్రమంలో దుర్గా భవాని సేవా సమితి సభ్యులు,నవదుర్గా సమితి సభ్యులు అంబేద్కర్



సంఘం సభ్యులు,భవానీ దీక్ష స్వాములు,మహిళలు భక్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.









# లలిత కళా తోరణంలో నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ వేడుకలు:






**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లోఉన్నలలిత కళా తోరణంలో “నానబియ్యం బతుకమ్మ” వేడుకలను నిర్వహించారు.ఈ వేడుకల్లో తెలంగాణ సమృద్ధమైన పుష్ప, సాంస్కృతిక వారసత్వంప్రతిబింబించింది.మహిళలుసంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భక్తి, ప్రకృతి ప్రేమ, సామాజిక ఐక్యత స్ఫూర్తిని ప్రతిబింబించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్ ) నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించి, ప్రోత్సహించడంతో పాటు, వాటిని రాష్ట్ర పర్యాటక అనుభవంలో అంతర్భాగంగా ప్రదర్శించేందుకు పర్యాటక శాఖ 2026 అక్టోబర్ 10 నుంచి 18 వరకు ఈ వేడుకలను నిర్వహిస్తోంది.

# రవీంద్రభారతిలో నాలుగవ రోజు ‘నాన బియ్యం బతుకమ్మ’ వేడుకలు

## తెలంగాణ జీవన విధానానికి, ప్రకృతి ఆరాధనకు నిదర్శనం బతుకమ్మ --శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి






**రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ అక్టోబర్ 13 :**
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నబతుకమ్మసంబరాలు రవీంద్రభారతిలో మంగళవారం నాలుగవ రోజు నాన బియ్యం బతుకమ్మ పేరిట అత్యంత వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో మహిళలు డప్పులతో సప్పుడుతో పాల్గొని, రంగురంగుల తంగేడు, గునుగు పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ కోలాటాలు ఆడుతూ, సాంప్రదాయ పాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్ హాజరై ప్రసంగించారు. ప్రకృతితో మమేకమై, పూలనే దైవంగా భావించి పూజించే అరుదైన సాంస్కృతిక మహోత్సవం బతుకమ్మ అని ఆయన కొనియాడారు. “మన సంస్కృతి, సాంప్రదాయాలు మరియు మానవీయ విలువలను తరతరాలకు అందించడంలో ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుంది.సమిష్టితత్వానికి,తెలంగాణఆత్మగౌరవాని కి బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయి” అని పేర్కొన్నారు.నానబెట్టిన బియ్యం, బెల్లం నైవేద్యంగా సమర్పించే ఈ నాలుగో రోజు సంబరాల్లో మహిళలతో పాటు చిన్నారులు, కళాకారులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు విశేషంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి వాహనసేవలో భక్తి పరిమళాలు.. జానపద కళల సందళ్లు

## తొమ్మిది రాష్ట్రాల నుంచి 17 కళాబృందాలు.. 489 మంది కళాకారుల ప్రదర్శనలు








**తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 13:**
తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైనమంగళవారంఉదయంశ్రీమలయప్పస్వామివారు చిన్నశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో వైభవంగావిహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. గోవిందనామస్మరణలు,మంగళవాయిద్యాలు, భక్తిగీతాలనడుమ సాగిన వాహనసేవ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటుతొమ్మిదిరాష్ట్రాలకచెందిన 17 కళాబృందాల్లోని 489మందికళాకారులుతమప్రాంతీయసంప్రదాయ కళారూపాలను ప్రదర్శించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆకట్టుకున్న సంప్రదాయ జానపద కళారూపాలు

**తప్పెటగుళ్ల నృత్యం:**
ఉత్తరాంధ్రకు ప్రత్యేకమైన తప్పెటగుళ్ల నృత్యం లయబద్ధమైన అడుగులు, తప్పెట వాయిద్యాల ధ్వనులతో అలరించింది. ఈ ప్రదర్శన ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పింది.

**థింసా నృత్యం:**
అరకులోయ గిరిజన ప్రాంతానికి చెందిన థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భుజాలపై చేతులు వేసుకుని వృత్తాకారంలో లయబద్ధంగా నృత్యం చేసిన గిరిజన కళాకారులు తమ ఐక్యతను, ఆనందోత్సాహాలను ప్రతిబింబించారు.

**కురత్తి నృత్యం:**
తమిళనాడుకు చెందిన కురత్తి నృత్యం జానపద కథలు, హావభావాలు, సంభాషణలతో తమిళ సంప్రదాయ కళావైభవాన్ని ఆవిష్కరించింది.

**కర్ణాటక జానపద కళలు:**
ఉడిపి, దక్షిణ కన్నడ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాటలు, నృత్యాల సమ్మేళనంతో తమ ప్రాంతీయ జానపద సంప్రదాయాలను ప్రదర్శించి భక్తులను అలరించారు.

**భక్తి.. సంస్కృతి.. భారతీయ కళావైభవం**
శ్రీవారి వాహనసేవలో వివిధ రాష్ట్రాల కళాకారులు తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా భారతీయ సంస్కృతిలోని వైవిధ్యం, ఐక్యత, భక్తి సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించాయి. స్వామివారి సేవలో కళలను ప్రదర్శించడం కళాకారులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించగా, భక్తులకు కనులవిందైన సాంస్కృతిక వేడుకగా నిలిచింది.


Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136